


# ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గద్దమీది బాలరాజు | శనివారం 05-09-2026 | సంపుటి - 31 | సంచిక - 103 | రూ : 4 | పేజీలు: 8


### అంగీకారంతో భూములిచ్చినవారికి
# 'పునరావాసం' కల్పించండి

- మల్లన్నసాగర్ భూసేకరణపై తీర్పు వెలువరించిన హైకోర్టు



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిమిత్తం జీవో 123 కింద పరస్పర అంగీకారంతో భూములిచ్చిన వారికి పునరావాసం, పునర్నిర్మాణ ప్రయోజనాలను నిరాకరించరాదని హైకోర్టు స్పష్టంచేసింది. సవరణ జీవో 214 కింద ఒప్పందం ద్వారా లావాదేవీలు పూర్తయ్యాయని, పత్రాల మార్పిడి జరిగి అంగీకారపత్రాలు సమర్పించారన్న కారణంగా పునరావాస ప్రయోజనాలను తిరస్కరించరాదంటూ తీర్పు వెలువరించింది. జీవో 123 కింద భూములను తీసుకున్న ప్రభుత్వం తరువాయి 2లో



## ఆటో ఛార్జీల పెంపు ప్రతిపాదన

* తొలి 1.6 కి.మీ. దూరానికి రూ.30
* తర్వాత ప్రతి కి.మీ.కు రూ.14

హైదరాబాద్: రాష్ట్రంలో ఆటో ఛార్జీలను పెంచాలంటూ అధికారుల కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. కొత్త ఛార్జీల ప్రకారం కనీస ఛార్జి 1.6 కిలోమీటర్ల దూరానికి రూ.30, ఆ తర్వాత ప్రతి కి.మీ.కి 14 తరువాయి 2లో



## రైలు ప్రయాణికులకు అలర్ట్
# 8 రైళ్ల కొత్త వేళలివే

- నవంబర్ మొదటి వారం నుంచి కొత్త షెడ్యూల్ అమలు
- ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు స్టేషన్లపై ప్రభావం
- ప్రయాణానికి ముందు కొత్త సమయాలను చూసుకోవాలని ప్రయాణికులకు

**సూచన**

రైలు ప్రయాణికులకు ముఖ్య గమనిక. దక్షిణ మధ్య రైల్వే తన పరిధిలో నడిచే 8 కీలక ఎక్స్‌ప్రెస్ రైళ్ల సమయాలను సవరించింది. ఈ మార్పులు ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ముఖ్యమైన స్టేషన్లలో ప్రభావం చూపనున్నాయి. నవంబర్ 2026 మొదటి వారం నుంచి వేర్వేరు తేదీల్లో ఈ కొత్త షెడ్యూల్ అమల్లోకి వస్తుందని రైల్వే శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రయాణికులు తమ ప్రయాణానికి ముందుగా కొత్త సమయాల తరువాయి 2లో

### ఢిల్లీని ముంచెత్తిన కుండపోత వర్షం
# జలదిగ్బంధంలో ఎయిర్‌పోర్ట్



- దేశ రాజధానిలో భారీ వర్షపాతం నమోదు
- విమాన సేవలకు తీవ్ర అంతరాయం, 400కు పైగా ఫ్లైట్స్ ఆలస్యం
- 9 విమానాలను జైపూర్, లక్నో, అహ్మదాబాద్‌కు దారి మళ్లింపు
- ప్రయాణికులకు హెచ్చరికలు జారీ చేసిన ఇండిగో, ఎయిర్ ఇండియా
- ఢిల్లీకి రెడ్ అలర్ట్ ప్రకటించిన భారత వాతావరణ శాఖ (IMD)

2లో



## రికార్డు సృష్టించిన ఇటలీ ప్రధాని

'నా స్నేహితురాలు మెలోనీ' అంటూ మోదీ అభినందనలు

- ఇటలీలో ఎక్కువ కాలం పనిచేసిన ప్రధానిగా రికార్డు సృష్టించిన మెలోనీ
- మెలోనీకి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేసిన ప్రధాని మోదీ 2లో

## ఫుకెట్ విమాన ప్రమాదం
### పైలట్ సస్పెన్షన్



- మాదకద్రవ్యాల పరీక్షల్లో పాజిటివ్‌గా తేలిన పైలట్‌ను తొలగించిన ఎయిర్ ఇండియా
- ఫుకెట్-ఢిల్లీ విమానంలో తీవ్ర ఘటన అనంతరం ఈ చర్యలు తీసుకున్న సంస్థ
- ఈ ఘటనలో 20 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బందికి గాయాలయ్యాయి
- పైలట్‌పై చర్యలు తీసుకోవాలని ఏఏఐబీ ప్రాథమిక నివేదికలో సిఫారసు
- భద్రత విషయంలో తమది జీరో టాలరెన్స్ విధానమని స్పష్టం చేసిన ఎయిర్ ఇండియా

2లో

### ఎవరెస్ట్ మంచుకు ముప్పు
## అధ్యయనంలో షాకింగ్ నిజాలు



- ఎవరెస్ట్ బేస్ క్యాంప్ కార్యకలాపాలతో మంచు కరుగుదల
- 2023లో 8.49 లక్షల మెగాజౌళ్ల వేడి విడుదల
- ఈ వేడి 2,492 టన్నుల మంచును కరిగించగలదు

2లో

### కొడంగల్: డిగ్రీ, గురుకుల
# భవన నిర్మాణాలపై సీఎం సమీక్ష

- మద్దూరు మున్సిపల్ కేంద్రంలో రేవంత్ పర్యటన
- వచ్చే విద్యా సంవత్సరం నుంచే తరగతులు అందుబాటులోకి రావాలని ఆదేశం
- భూములిచ్చిన దాతలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్న సీఎం



తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ పరిధిలోని మద్దూరు మున్సిపల్ కేంద్రంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో విచ్చేసిన ఆయన, మద్దూరులో రూపుదిద్దుకుంటున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గురుకుల భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో స్వయంగా తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాల భవనాన్ని మార్చి నెలలోగా వేగవంతంగా పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులకు తరగతులు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణాల పురోగతిని పరిశీలించిన రేవంత్ రెడ్డి... కళాశాల ప్రాంగణాన్ని మరింత విశాలంగా తీర్చిదిద్దేందుకు పక్కనే ఉన్న స్థలాన్ని వెంటనే సర్వే చేసి భూసేకరణ ప్రక్రియ వేగవంతం

తరువాయి 2లో




# అంగీకారంతో భూములిచ్చినవారికి 'పునరావాసం' కల్పించండి

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిమిత్తం జీవో 123 కింద పరస్పర అంగీకారంతో భూములిచ్చిన వారికి పునరావాసం, పునర్నిర్మాణ ప్రయోజనాలను నిరాకరించరాదని హైకోర్టు స్పష్టంచేసింది. సవరణ జీవో 214 కింద ఒప్పందం ద్వారా లావాదేవీలు పూర్తయ్యాయని, పత్రాల మార్పిడి జరిగి అంగీకారపత్రాలు సమర్పించారన్న కారణంగా పునరావాస ప్రయోజనాలను తిరస్కరించరాదంటూ తీర్పు వెలువరించింది. జీవో 123 కింద భూములను తీసుకున్న ప్రభుత్వం భూసేకరణ చట్టంలోని పునరావాస, పునర్నిర్మాణ పథకం కింద ప్రయోజనాలు కల్పించకపోవడాన్ని సవాలు చేస్తూ సిద్దిపేట జిల్లా తొగుట మండలం ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామానికి చెందిన టి.బాలామణి, మరికొందరు వేర్వేరుగా 2017లో హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌లపై జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డి ఇటీవల విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ..."కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూసేకరణ నిమిత్తం జీవో 123 జారీ చేశారు. తర్వాత పునరావాస ప్రయోజనాలను విడిగా కల్పిస్తామంటూ జీవో 214 జారీ అయింది. ఈ మధ్యలో జీవో 123 కింద భూమిని సేకరించరాదంటూ ఇదే హైకోర్టు తీర్పు వెలువరించగా ప్రభుత్వం దాన్ని సవాలు చేసింది. ఇంకా అది పెండింగ్‌లో ఉండగా... ఇప్పటికే జీవో 123 కింద పిటిషనర్ల భూములను ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేయించుకుంది. ఒప్పందంలో వారికి పునరావాసం, పునర్నిర్మాణం ప్రయోజనాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అమలు చేయడంలేదు" అని వివరించారు. ప్రభుత్వ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ... పిటిషనర్లు ప్రభుత్వం చెల్లించిన పరిహారానికి అంగీకరించాకే భూములను ఇచ్చారని చెప్పారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి... "పునరావాసం, పునర్నిర్మాణ ప్రయోజనాలను పొడిగించే అంశాన్ని పరిశీలించాలి. ఈ ప్రక్రియ మొత్తం ఆరు నెలల్లో పూర్తి చేయాలి. ఈ ఉత్తర్వులు కేవలం పునరావాస ప్రయోజనాలకే పరిమితం. జీవో చట్టబద్ధతపై ఈ కోర్టు ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయడంలేదు" అని పేర్కొన్నారు.

# ఆటో ఛార్జీల పెంపు ప్రతిపాదన

హైదరాబాద్: రాష్ట్రంలో ఆటో ఛార్జీలను పెంచాలంటూ అధికారుల కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. కొత్త ఛార్జీల ప్రకారం కనీస ఛార్జి 1.6 కిలోమీటర్ల దూరానికి రూ.30, ఆ తర్వాత ప్రతి కి.మీ.కి 14 రూపాయలుగా ఉండనుంది. నిరీక్షణ సమయానికి నిమిషానికి 75 పైసలు, రాత్రి సమయంలో సాధారణ ఛార్జీకి 50% అదనంగా ఉండాలని కమిటీ సూచించింది. ఈ మేరకు నివేదికను రవాణాశాఖ కమిషనర్ డాక్టర్ కె.ఇలంబర్తి ప్రభుత్వానికి తాజాగా సమర్పించారు. ఈ సిఫార్సులను సర్కారు ఆమోదించగానే ఆటో ఛార్జీల పెంపుపై ఉత్తర్వులు జారీ కానున్నాయి.

**ఛార్జీల పెంపు కమిటీ ఏం చెప్పింది?**

'తెలంగాణ రాష్ట్ర ఆటో, యాప్ బేస్డ్ యూనియన్ల' ఐకాస 14 డిమాండ్లతో ఆగస్టు 7న నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చింది. ఆగస్టు 23న యూనియన్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో 15 రోజుల్లో ప్రతిపాదనలు పంపుతామని అధికారులు చెప్పడంతో సమ్మె నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. ఈ నేపథ్యంలో డీటీసీ సురేష్‌రెడ్డి, ఎంవీఐ శ్రీనివాస్, ఏఎంవీఐలు కేరళ, దిల్లీ, కర్ణాటక (బెంగళూరు), మహారాష్ట్ర (ముంబయి)లో ఉన్న ఆటోఛార్జీలపై అధ్యయనం చేసి నివేదిక ఇచ్చారు. ఇంధన ధరలతోపాటు బీమా, ఇతరత్రా ఖర్చులు పెరిగాయని.. అందువల్ల ఛార్జీల పెంపునకు సిఫార్సు చేసినట్లు అధికారుల కమిటీ నివేదికలో వివరించింది. ఇంకా ఆటో ధర రూ.2.55 లక్షలు, బ్యాంకు రుణం 70%, డ్రైవర్ నెల జీతం రూ.25 వేలు, రోజుకు సగటున 163.8 కి.మీ. ప్రయాణం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంది. ప్రతి రెవెన్యూఎర్నింగ్ కిలోమీటరుకు నిర్వహణ ఖర్చు రూ.13.53గా ఉంది. దీంతో రూ.14కు సిఫార్సు చేసింది. గత 12 ఏళ్లుగా ఆటోఛార్జీలు మారలేదని, ఇప్పుడు పెంచాలని అధికారుల కమిటీ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో పేర్కొంది.

## ఢిల్లీని ముంచెత్తిన కుండపోత వర్షం..

# జలదిగ్బంధంలో ఎయిర్‌పోర్ట్

దేశ రాజధాని ఢిల్లీని శుక్రవారం భారీ వర్షం ముంచెత్తింది. ఈ కుండపోత వర్షం కారణంగా ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం జలమయమైంది. దీంతో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వందలాది విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, పలు విమానాలను ఇతర నగరాలకు దారి మళ్లించారు. వివరాల్లోకి వెళితే, శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఢిల్లీలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలోని పలు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. ఈ ప్రభావంతో మధ్యాహ్నం 3:30 నుంచి 4:30 గంటల మధ్యలో దాదాపు తొమ్మిది విమానాలను దారి మళ్లించారు. వీటిలో నాలుగు విమానాలను జైపూర్‌కు, మరో నాలుగు లక్నోకు, ఒకటి అహ్మదాబాద్‌కు మళ్లించినట్లు అధికారులు తెలిపారు. ఫ్లైట్‌రాడార్24 డేటా ప్రకారం, 400కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఈ విమానాశ్రయంలో రోజుకు 1,300కు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతికూల వాతావరణం కారణంగా ఢిల్లీ విమాన సర్వీసులపై ప్రభావం పడిందని ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు వేర్వేరుగా ప్రకటించాయి. ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరే ముందు తమ ఫ్లైట్ స్టేటస్‌ను తప్పనిసరిగా చెక్ చేసుకోవాలని సూచించాయి. రోడ్లపై నెమ్మదిగా ప్రయాణం సాగుతున్నందున, ప్రయాణానికి అదనపు సమయం కేటాయించుకోవాలని ఇండిగో కోరింది. ఎయిర్‌పోర్ట్‌లో కార్యకలాపాలపై ప్రభావం పడిందని, తాజా సమాచారం కోసం ప్రయాణికులు సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించాలని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ యాజమాన్యం విజ్ఞప్తి (జీఎంఆర్) చేసింది. నీటిని తొలగించడానికి తమ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపింది. మరోవైపు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఢిల్లీకి 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. సాయంత్రం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన తీవ్ర వర్షపాతం నమోదవుతుందని హెచ్చరించింది. ఈ ఆకస్మిక పరిణామంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



## కొడంగల్ నియోజకవర్గంలో డిగ్రీ, గురుకుల భవన నిర్మాణాలను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)



చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంకను ఆదేశించారు. ఇదే సమయంలో గురుకుల భవన నిర్మాణానికి తమ అమూల్యమైన సొంత భూములను ఉచితంగా అందించిన దాతల ఉదారతను అభినందిస్తూ, వారికి వెంటనే 'ఇందిరమ్మ ఇళ్లు' మంజూరు చేయాలని అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. నిర్మాణ పనుల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడొద్దని స్పష్టం

## వంటింటిపై ధరల పిడుగు..

# ఆకాశాన్నంటిన ఉల్లి, అల్లం, వెల్లుల్లి

సామాన్యుడి వంటింట్లో ధరల మంట రాజుకుంది. నిత్యావసరాలైన ఉల్లి, అల్లం, వెల్లుల్లి ధరలు ఆకాశాన్నంటుతూ నెలవారీ బడ్జెట్‌ను తలకిందులు చేస్తున్నాయి. ముఖ్యంగా ఉల్లి ధర నెల రోజుల వ్యవధిలోనే రెట్టింపు కావడంతో వినియోగదారులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. అయితే, ఈ ధరల పెరుగుదల రైతులకు మాత్రం ఊరటనిస్తోంది. హైదరాబాద్ మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో నెల క్రితం క్వింటాల్ రూ. 2,000 ఉన్న మహారాష్ట్ర ఉల్లి ధర, ఇప్పుడు ఏకంగా రూ. 5,000 మార్కును తాకింది. ఏడాది కాలంలో ఇదే గరిష్ఠ ధర అని వ్యాపారులు చెబుతున్నారు. ఉల్లి బాటలోనే అల్లం, వెల్లుల్లి కూడా పయనిస్తున్నాయి. కర్ణాటక నుంచి వచ్చిన అల్లం క్వింటాల్ రూ. 16,000 పలుకుతుండగా, మధ్యప్రదేశ్ నుంచి దిగుమతి అయిన వెల్లుల్లి ధర క్వింటాల్‌కు రూ. 19,000గా నమోదైంది. దీంతో బహిరంగ మార్కెట్‌లో కిలో వెల్లుల్లి ధర రూ. 250 దాటిపోయింది. ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణం వర్షాభావ పరిస్థితులతో దిగుబడులు తగ్గడమేనని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మహారాష్ట్రలో గత జూన్, జులై నెలల్లో కురిసిన భారీ వర్షాలకు పంట దెబ్బతింది. మరోవైపు, కర్ణాటక, కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక ఉల్లి సాగు గణనీయంగా పడిపోయింది. ఫలితంగా, రోజుకు 20 వేల క్వింటాళ్లు రావాల్సిన మలక్‌పేట మార్కెట్‌కు ప్రస్తుతం కేవలం 5 వేల క్వింటాళ్ల ఉల్లి మాత్రమే వస్తోంది. ధరల పెరుగుదల వినియోగదారులకు భారంగా మారినప్పటికీ, రైతులకు మాత్రం ఆనందాన్నిస్తోంది. గతంలో గిట్టుబాటు ధర లేక పంటను రోడ్లపై పారబోసిన రైతులు, ఇప్పుడు మంచి ధర దక్కుతుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో కొత్త పంట మార్కెట్‌కు వచ్చే వరకు ధరలు తగ్గకపోవచ్చని, ఈ భారం తప్పదని వ్యాపారులు చెబుతున్నారు.

# పుకెట్ విమాన ప్రమాదం: పైలట్ సస్పెన్షన్

విమాన ప్రయాణికుల భద్రతను ప్రమాదంలోకి నెట్టిన ఓ పైలట్‌పై ఎయిర్ ఇండియా కఠిన చర్యలు తీసుకుంది. మాదకద్రవ్యాల (సైకోయాక్టివ్ సబ్‌స్టాన్స్) పరీక్షలో పాజిటివ్‌గా తేలడంతో పైలట్ ఇన్‌కమాండ్ (పీఐసీ)ని తక్షణమే ఉద్యోగం నుంచి తొలగించినట్లు శుక్రవారం ప్రకటించింది. పుకెట్ నుంచి ఢిల్లీ వస్తున్న విమానంలో తీవ్రమైన ఘటన చోటుచేసుకున్న అనంతరం నిర్వహించిన పరీక్షల్లో ఈ విషయం బయటపడింది. భద్రతా నిబంధనల ఉల్లంఘన విషయంలో తమది "జీరోటాలరెన్స్" విధానమని ఎయిర్ ఇండియా ప్రతినిధి స్పష్టం చేశారు. "పుకెట్ ఢిల్లీ విమాన పైలట్ మాదకద్రవ్యాల పరీక్షలో పాజిటివ్‌గా తేలారు. భద్రత, ఫిట్‌నెస్ లేదా ఇతర నియంత్రణ నిబంధనల ఉల్లంఘనను ఏమాత్రం సహించబోము. ఈ కారణంగా ఆ పైలట్ సేవలను తక్షణమే రద్దు చేశాం" అని ఆయన తెలిపారు. ఈ ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ప్రాథమిక దర్యాప్తు నివేదికను విడుదల చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పైలట్ డ్రగ్స్ టెస్టులో పాజిటివ్‌గా తేలడం తీవ్రమైన ఆందోళన కలిగించే అంశమని, దీనిపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఏఐబీ తన నివేదికలో సిఫారసు చేసింది.

**ఏం జరిగింది?**

వివరాల ప్రకారం, ఆగస్టు 4న 137 మంది ప్రయాణికులు, ఆరుగురు క్యాబిన్ సిబ్బంది, ఇద్దరు పైలట్లతో కలిపి మొత్తం 145 మందితో ఎయిర్ ఇండియాకు చెందిన ఎయిర్‌బస్ ఏ320 విమానం (ఏఐ2379) పుకెట్ నుంచి ఢిల్లీకి బయలుదేరింది. విమానం ఒడిశా గగనతలంలో 36,000 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తుండగా, దానిలోని మూడు హైడ్రాలిక్ వ్యవస్థలు ఒకేసారి విఫలమయ్యాయి. దీంతో విమానం అదుపుతప్పి ఒక్కసారిగా 372 అడుగులు పైకి వెళ్లి, ఆ తర్వాత 292 అడుగులు కిందికి వచ్చేసింది. ఈ ఘటనలో 20 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది గాయపడ్డారు. ఘటన అనంతరం ఢిల్లీలో ఇద్దరు పైలట్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో ఇద్దరికీ నెగెటివ్ రాగా, మాదకద్రవ్యాల పరీక్షలో పీఐసీకి "నాన్ నెగెటివ్" ఫలితం వచ్చింది. అనంతరం నిర్ధారణ కోసం ఇద్దరి రక్త నమూనాలను ల్యాబొరేటరీకి పంపగా, పీఐసీ డ్రగ్స్ తీసుకున్నట్లు మరోసారి నిర్ధారణ అయింది. కోపైలట్ ఫలితాలు మాత్రం నెగెటివ్‌గా వచ్చాయి. ఈ ఘటనపై సాంకేతిక, ఇతర అంశాలపై ఏఏఐబీ పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగిస్తోంది. విమానం బయలుదేరే ముందు నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి సమస్యలు లేవని నివేదిక పేర్కొంది.

## రికార్డు సృష్టించిన ఇటలీ ప్రధాని..

# 'నా స్నేహితురాలు మెలోనీ' అంటూ మోదీ అభినందనలు

ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆ దేశ రాజకీయ చరిత్రలో ఒక అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. యుద్ధానంతర ఇటలీ చరిత్రలో అత్యధిక కాలం నిరంతరాయంగా ప్రధానిగా పనిచేసిన వ్యక్తిగా ఆమె నిలిచారు. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. మెలోనీని 'నా స్నేహితురాలు' అని సంబోధిస్తూ, ఆమె నాయకత్వంపై ఇటలీ ప్రజలకు ఉన్న విశ్వాసానికి ఈ మైలురాయే నిదర్శనమని ప్రశంసించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా మోదీ స్పందిస్తూ.. "ఇటలీ యుద్ధానంతర చరిత్రలో సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగుతున్న నా స్నేహితురాలు జార్జియా మెలోనీకి అభినందనలు. ఈ విజయం ఆమె నాయకత్వంపై ఇటలీ ప్రజలు ఉంచిన నమ్మకానికి, విశ్వాసానికి ప్రతీక" అని పేర్కొన్నారు. భారత్ ఇటలీ మధ్య 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం' బలోపేతం కావడంలో మెలోనీ స్నేహం కీలక పాత్ర పోషించిందని మోదీ అన్నారు. భవిష్యత్తులో కూడా ఇరు దేశాల ప్రజల శ్రేయస్సు కోసం కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. 2022 అక్టోబర్ 22న ఇటలీ తొలి మహిళా ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన జార్జియా మెలోనీ, ఇవాళ్టికి 1,413 రోజులు పదవిలో పూర్తి చేసుకున్నారు. తద్వారా మాజీ ప్రధాని సిల్వియో బెర్లుస్కోనీ రికార్డును ఆమె అధిగమించారు. గత జులైలో ప్రధాని మోదీ భారత చరిత్రలో అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా నిలిచినప్పుడు మెలోనీ కూడా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఇరు దేశాల ప్రజలకు కొత్త అవకాశాలు సృష్టించేందుకు కలిసి పనిచేస్తామని ఆమె పేర్కొన్నారు. గత మే నెలలో మోదీ ఇటలీలో పర్యటించినప్పుడు ఇరు దేశాల సంబంధాలను 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి పెంచుతూ ఇరు నేతలు నిర్ణయం తీసుకున్నారు. ఈ పర్యటన సందర్భంగా మోదీ, మెలోనీకి సరదాగా 'మెలోడీ' చాక్లెట్ల ప్యాకెట్‌ను బహుమతిగా ఇచ్చారు. సోషల్ మీడియాలో వారిద్దరి పేర్లతో వైరల్ అయిన '#Melodi' ట్రెండ్‌ను ఇది గుర్తుచేసింది. ఈ ఆసక్తికర క్షణాలను మెలోనీ ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంటూ మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఇరు నేతల మధ్య ఉన్న ఈ స్నేహపూర్వక వాతావరణం ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఎవరెస్ట్ మంచుకు కొత్త ప్రమాదం..

# షాకింగ్ విషయాలు వెల్లడించిన అధ్యయనం

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ శిఖరం వద్ద మరో ఆందోళనకర విషయం బయటపడింది. బేస్ క్యాంప్‌లో పెరుగుతున్న మానవ కార్యకలాపాలు ఖుంబు హిమానీనదం కరుగుదలను మరింత పెంచుతున్నాయని తాజా అధ్యయనం తెలిపింది. వాతావరణ మార్పులతో పాటు ఇంధన వినియోగం, మనుషుల మూత్ర విసర్జనతో విడుదలయ్యే వేడి కూడా దీనికి కారణమవుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ప్రతి క్లైంబింగ్ సీజన్‌లో వేలాది మంది పర్వతారోహకులు, పర్యాటకులు, గైడ్లు, సిబ్బందితో సందడిగా మారుతుంది. వంట, విద్యుత్, వేడి కోసం ఎల్పీజీ, కిరోసిన్, పెట్రోల్ వాడుతున్నారు. వీటి నుంచి భారీగా వేడి విడుదలవుతోంది. మనుషుల మూత్ర విసర్జనను కూడా పరిశోధకులు లెక్కల్లోకి తీసుకున్నారు. 2023 వసంతకాలంలో బేస్ క్యాంప్‌లో విడుదలైన మొత్తం వేడి 8,49,174 మెగాజౌళ్లుగా అంచనా వేశారు. ఈ వేడి దాదాపు 2,492 టన్నుల మంచును కరిగించగలదని అధ్యయనం వెల్లడించింది. 1991 నుంచి 2023 వరకు ల్యాండ్శాట్ ఉపగ్రహ సమాచారాన్ని పరిశీలించగా బేస్ క్యాంప్ ప్రాంతంలో ఉష్ణోగ్రత ఏటా 0.28 డిగ్రీల సెల్సియస్ పెరిగినట్లు తేలింది. ఖుంబు హిమానీనదంతో పోలిస్తే ఇక్కడ వేడెక్కుతున్న వేగం దాదాపు రెండింతలుగా ఉంది. ప్రస్తుతం ఎవరెస్ట్ బేస్ క్యాంప్ హిమానీనదంపైనే ఉంది. పరిస్థితులు మరింత దిగజారితే క్యాంప్‌ను తరలించాల్సి రావచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. ప్రస్తుత క్యాంప్‌కు నైరుతి దిశలో స్థిరమైన నేలపై రెండు ప్రత్యామ్నాయ ప్రాంతాలను కూడా గుర్తించారు.

## నేపాల్ మహా విషాదంలో ఒక అద్భుతం..

# 9 రోజుల తర్వాత సొరంగం నుంచి ప్రాణాలతో బయటపడ్డ ఇద్దరు!

నేపాల్‌లో జల ప్రళయం సృష్టించిన మహా విషాదంలో ఒక అద్భుతం చోటుచేసుకుంది. వరదలు ముంచెత్తిన తొమ్మిది రోజుల తర్వాత, బురద, శిథిలాలతో పూర్తిగా కూరుకుపోయిన ఒక జల విద్యుత్ ప్రాజెక్ట్ సొరంగం నుంచి ఇద్దరు కార్మికులను సహాయక సిబ్బంది సజీవంగా బయటకు తీశారు. ఈ ఘటనతో ఇంకా అనేక సొరంగాల్లో చిక్కుకుపోయిన వందలాది మంది కార్మికులు కూడా ప్రాణాలతో బయటపడతారనే ఆశలు బలపడ్డాయి. నేపాల్‌లోని త్రిశూలి 3A జల విద్యుత్ ప్రాజెక్టులో ఆగస్టు 26న సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా కార్మికులు సొరంగంలో చిక్కుకుపోయారు. అప్పటి నుంచి సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. తొమ్మిది రోజుల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఇద్దరిని ప్రాణాలతో కాపాడటం అక్కడివారిలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. బురదతో నిండిపోయిన కార్మికులను సహాయక సిబ్బంది తమ భుజాలపై మోసుకుని బయటకు తీసుకువస్తున్న దృశ్యాలు స్థానిక టీవీ ఛానళ్లలో ప్రసారమయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు, చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఒక వీడియోలో, కార్మికుడిని సొరంగం నుంచి బయటకు తీయగానే సహాయక సిబ్బంది ఆనందంతో కేరింతలు కొట్టడం కనిపించింది. మరో చిత్రంలో, బురదలో కూరుకుపోయిన మరో వ్యక్తిని స్ట్రెచర్‌పై తరలిస్తుండగా, అతను చేతులు జోడించి నమస్కరించడం హృదయాలను కదిలించింది.

## వివాహ వేడుక లో పాల్గొన్న పిల్లుట్ల రఘు



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: గరిడేపల్లి మండలం కాల్వపల్లి గ్రామం అరిగెల ఉపేందర్ మల్లేశ్వరి గార్ల కుమార్తె వివాహ వేడుకలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు పిల్లుట్ల రఘు అన్న పాల్గొని వారిని ఆశీర్వదించి పట్టు వస్త్రములు పట్టుచీర వెండి మెట్టెలు పసుపు కుంకుమ ఇచ్చి వాళ్ళని ఆశీర్వదించడం జరిగింది ఈ వివాహ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## ఘనంగా శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: శ్రావణమాసం నాలుగవ శుక్రవారం సందర్భంగా జిల్లా కేంద్రలో వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారినిప్రత్యేక గాజులతో అలంకరించారు. లక్ష్మి గణపతికి, నగేశ్వరుడికి, వాసవిమాతకు పంచామృత అభిషేకాలు నిర్వహించి భక్తులు సమర్పించిన రంగు రంగుల గాజులతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అనంతరం భక్తులచే ప్రత్యేక పూజలతో పాటు లలితా పారాయణం, వాసవి పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. కుంకుమ పూజ కార్యక్రమంలో మహిళా భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు శింగిరికొండ సురేందర్, ప్రధాన కార్యదర్శి ఈగ వెంకటేశ్వర్లు, గుండా శ్రీధర్, ఈగ రామయ్య, కందిబండ సూరయ్య, ఈగ పద్మావతి, గుండా ప్రేమలత, బజ్జూరి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కనకదుర్గమ్మ పండగ

* **రంగురంగుల పూలతో ఆకర్షణీయంగా నిలిచిన అమ్మవారి ప్రభలు.**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: ఘనంగా కనకదుర్గమ్మ అమ్మవారి పండగను మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో అఖిలపక్షం కమిటీ సభ్యులు, కనకదుర్గమ్మ గుడి నిర్మాణ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కనకదుర్గమ్మ అమ్మవారి వేషధారణలో మహిళల తో పాటు ముస్లిం యువకుడు చీరే గాజులను ధరించి అమ్మవారిగా భక్తిశ్రద్ధలతో వేపమండలను ధరించి గనాచారులుగా వీధులలో తిరుగుతూ గ్రామంలోని భక్తులను దీవించారు.అమ్మవారికి ప్రభలు బండ్లను ఆయా పార్టీల జెండాలతో అలంకరించి మేళ తాళాలతో ఊరేగింపుగా బయలుదేరి శుక్రవారం ఉదయానికి ఆలయానికి చేరుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొల్లేపల్లి రామనాథం గౌడ్ మాజీ సర్పంచులు సంక బుడ్డి నరసయ్య, ముత్తినేని సుబ్బయ్య, గ్రామ పెద్దలు పోలంపల్లి ఆనంద్ బాబు, పిడమర్తి అంజి, దాసరి వెంకటేశ్వర్లు, నర్సింగ్ వెంకటేశ్వర్లు, బాదే నరసయ్య, ముత్తినేని రామయ్య, ముత్తినేని కోటేశ్వరరావు, గ్రామ పెద్దల గ్రామస్తులు పాల్గొన్నారు

## ద్వి సహస్ర గళ సంపూర్ణ భగవద్గీత పారాయణం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:జిల్లా కేంద్రంలోని సీతారామ ఫంక్షన్ హాల్ లో సెప్టెంబర్ నెల 6న ఆదివారం ద్విసహస్ర గళ సంపూర్ణ భగవద్గీత పారాయణం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు బోనగిరి విజయ్ కుమార్ తెలిపారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషిమాత దేవాలయంలో ద్వి సహస్ర గళ సంపూర్ణ భగవద్గీత పారాయణ కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కోటి సంపూర్ణ భగవద్గీత పారాయణ మహా యజ్ఞంలో భాగంగా గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశీస్సులతో దత్త విజయానంద తీర్థ స్వామీజీ అజ్ఞానుసారం ద్వి సహస్ర గళ సంపూర్ణ భగవద్గీత పారాయణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ గీతా సారాన్ని తెలుసుకొని తమ జీవితంలో ఆచరించాలని ,ఒకే చోట ఒకే సమయంలో రెండు వేల మంది సాధకులతో కలిసి పరమ పవిత్రమైన భగవద్గీత పారాయణం చేయడం జీవితంలో ఎప్పటికీ మరచిపోలేని ఒక అద్భుత ఘట్టమని పేర్కొన్నారు.ఏ వయస్సు వారైనా , భక్తులు, ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బ్రహ్మాండ్లపల్లి మురళీధర్, నరేంద్రుని విద్యాసాగర్, గోపారపు రాజు, కలకోటి నరసయ్య, సోమా శ్రీశైలం, దేవరశెట్టి సోమయ్య, యామా వెంకటేశ్వర్లు, గుండా వెంకన్న, గుడిపాటి రమేష్, బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## వైష్ణవి టెక్నో స్కూల్లో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి: శ్రీ కృష్ణాజన్మాష్టమి పర్వదినం సందర్భంగా జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి సంజయ్పురికాలనీలో గల వైష్ణవి టెక్నో స్కూల్లో శుక్రవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని,విద్యార్థులు గోపిక కృష్ణా వేషధారణలో అలరించారు. కృష్ణుడి వేషధారణలో చిన్నారులు నెమలి పింఛం,కిరీటంతో మురిపించగా గోపికమ్మల వేషధారణలో బాలికలు సంప్రదాయ దుస్తులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారుల ముద్దుముద్దు వేషధారణలు, చిరునవ్వులు, ఉత్సాహం వేడుకలకు మరింత శోభను తీసుకొచ్చాయి.ఈ వేడుకలకు వైష్ణవి విద్యా సంస్థల చైర్మన్ చెప్యాల నర్సింహులు గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారుల ముచ్చటైన వేషధారణ, చిరునవ్వులు, సంప్రదాయ అలంకరణలు వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చాయన్నారు.

# మాట తప్పిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెప్పాలి

* **మండల పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు గుగులోతుసందీప్ నాయక్**




గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గరిడేపల్లి మండల పరిధిలో ఉన్న గారకుంట తండ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి హుజూర్నగర్ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి బిఆర్ఎస్ పార్టీ నాయకులు పిల్లుట్ల రఘు సారథ్యంలో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను వివరిస్తూ 420 డిక్లరేషన్ హామీలను ప్రజలకు వివరించారు ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రతి ఒక్కటి గాలికి వదిలేసారని మండల పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు సందీప్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు కళ్యాణ లక్ష్మి పథకం కింద లక్ష తో పాటు తులం బంగారం ఇస్తానని చెప్పి కనీసం కల్యాణ లక్ష్మి పథకాన్ని తీసేసిందని ఎకరాకు 6000 రూపాయలు ఇస్తామని వృద్ధులకు 4000 వికలాంగులకు 6000 ఇస్తామని మహిళలకు 2500 ఇస్తామని కెసిఆర్ ప్రభుత్వంలో రైతు బీమా పథకం కింద సాధారణ రైతు చనిపోతూ వారం రోజుల్లో 5 లక్షల రూపాయలు చెక్కు ఇంటికి వచ్చేదని ఈ పథకం కూడా తీసివేశారని అన్నారు. చెప్పి మాట తప్పిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెప్పాలని వారు అన్నారు నాగార్జునసాగర్ లో 535అడుగులు నీరు ఉన్నా కూడా ఎడమ కాలువ కింద రైతులకు నీళ్లు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారని హుజూర్నగర్ శాసనసభ్యులు తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి హుజూర్నగర్ ప్రాంత రైతాంగం మీద చిత్తశుద్ధి ఉంటే కచ్చితంగా మీరు ఈ ప్రాంత రైతులకు న్యాయం చేయాలని సాగర్ ఎడమ కాలువ కింద నీరు పూర్తిస్థాయిలో వరి పంట సాగు కొరకువిడుదల చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు నరేందర్ నాయక్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకట్రామ్ నాయక్ సర్దార్ నాయక్ లింగా నాయక్ నంద నాయక్ కిషన్ నాయక్ నాగేశ్వరరావు మహిళలు ఈరోలి పరేంగన్ దాని చిన్ని వాలి బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ఘనంగా కుంకుమార్చన



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం చిన్న కొండూరు రోడ్డులోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శ్రావణమాసం నాలుగవ శుక్రవారం పురస్కరించుకొని కుంకుమార్చన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ట్రినిటీ విద్యాలయాల సంస్థ, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సౌజన్యంతో శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో మహిళా భక్తులచే ప్రత్యేకంగా కాశీ నుంచి తెచ్చిన శ్రీ చక్రములపై కుంకుమార్చన కార్యక్రమం వేద పండితులు పెద్ది సుధాకర్ శర్మ వేద మంత్రోచ్చరణలతో కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ శ్రీ భవాని మాత ఆశీర్వాదం కొరకు కుంకుమార్చన నిర్వహించిన ప్రతి భక్తురాలికి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. అదేవిధంగా చౌటుప్పల్ మున్సిపల్ ప్రజలు అమ్మవారి ఆశీస్సులతో సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ళ మురళి గురుస్వామి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ , పిల్లలమర్రి మధుసూదన్, బత్తుల వాణి విప్లవ్ గౌడ్, కాసర్ల మంజుల, కోఆప్షన్ సభ్యులు సందగళ్ళ విజయ, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ అధ్యక్షురాలు వెన్ రెడ్డి సంధ్య, ట్రినిటీ విద్యాలయాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉజ్జిని మంజుల, పెద్ది స్వాతి కిషోర్ శర్మ, ధర్మకర్తలు వర్కాల రవి గౌడ్, ఆవుల యేసు యాదవ్, దాడి యశ్వంత్ రెడ్డి, గగులోతు అరుణ, బొబ్బిళ్ళ సంధ్య, వర్కాల వెన్నెల, పబ్బు శ్రీకాంత్ గౌడ్, మొగుదాల వెంకటేష్ గౌడ్, మునుకుంట్ల పద్మావతి, సుర్వి మంజుల, దాడి పద్మ, ముటుకుల్లోజు నీరజ, వనం మమత, సింగిరి కొండ శైలజ, బడుగు గౌరీశ్వరి, బొబ్బిళ్ళ యశోధ, మన్నె శివరాణి, బొడిగె రాధిక, పగడాల అనూష, మామిడి వెంకటమ్మ, శాలిని, అనూష, ప్రసన్నలక్ష్మి, జూకంటి రేవతి, ఎలమోని హారిక, కాసాని ఐలమ్మ, కీర్తన, పార్సి సంధ్య, పార్షి నికిత, బొబ్బిళ్ళ సామ్రాట్, మునుకుంట్ల శేఖర్ గౌడ్, డాకోజి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పైల్ల శేఖర్ రెడ్డి ఏం అభివృద్ధి చేశాడో దమ్ముంటే చర్చకు రండి

* **గట్టి కౌంటర్ ఇచ్చిన బత్తిని సహదేవ్**



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : పదేళ్లు భువనగిరి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన మాజీ ఎమ్మెల్యే పైల శేఖర్ రెడ్డి చేసిన అభివృద్ధి ఏమిటో ఆధారాలతో వస్తారా అంటూ వలిగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గట్టి కౌంటర్ ఇచ్చారు శుక్రవారం ఆయన స్థానిక సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డిబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి జిల్లా కార్యదర్శి చెరుకు శివయ్య గౌడ్ తోకలిసి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి నివాసంలో విలేకరు సమావేశాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేఖర్ రెడ్డి 10 ఏళ్ళు అధికారంలో ఉండి నియోజకవర్గ అభివృద్ధికి ఏమాత్రం కృషి చేయలేదని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 30 నెలల పాలన లోనే తమ నాయకుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఎంతో అభివృద్ధి చేశాడని ఆయన అన్నారు ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించేందుకు పునాది గాని కాలువ వెడల్పు పెంచడం కోసం 240 కోట్లు మంజూరు చేసి పనులకు కూడా శ్రీకారం చుట్టడం జరిగిందని ఇంకా 150 కోట్లు ధర్మారెడ్డి పల్లి కాలువకు మంజూరు చేసి సాగునీరు అందిస్తున్న ఘనత కుంభంకు ఉందని శేఖర్ రెడ్డి ప్రాజెక్టుల పట్ల ఏ ఒక్కనాడు కూడా శ్రద్ధ చూపలేదని కానీ ఇప్పుడు అధికారం కోల్పోయామని ఆవేదనతో చౌకబారు మాటలు మాట్లాడుతున్నాడని ఇలాంటి మాటలను నియోజకవర్గ ప్రజలు వలిగొండ మండల ప్రజలు ఎవరు కూడా నమ్మరని సహదేవ్ గౌడ్ గట్టి వాక్యాలు చేశారు గతంలో బసవపురం ప్రాజెక్టులో ముంపు బాధితులకు పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న శేఖర్ రెడ్డి ఒక్కరోజు కూడా కేసీ ఆర్ ను కలిసి నష్టపరిహారం ఇప్పించలేదని కానీ మా ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు వెళ్లి ముంపు బాధితులకు నష్ట పరిహారం ఇచ్చేందుకు 206 కోట్లు మంజూరు చేయించడం జరిగిందని ఆయన వివరించారు అదేవిధంగా వలిగొండ మండలంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు 250 కోట్లు మంజూరు చేయించిన ఘనత కూడా కుంభంకు ఉందని ఇంకా భీమ లింగం వద్ద ఐ లెవెల్ బ్రిడ్జి నిర్మాణం కొరకు 56 కోట్లను ముఖ్యమంత్రి తో మంజూరు చేయించడం జరిగిందని అంతేగాక గ్రామాలలో బీటీ రోడ్లు సిసి రోడ్ల నిర్మాణానికి లక్షలాది రూపాయలు మంజూరు చేయించడం జరిగిందని ఏ రోజు కూడా నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆలోచించని పైల శేఖర్ రెడ్డి కుంభం అనిల్ కుమార్ రెడ్డి పై ఆరోపణలు చేసే అధికారం లేదని ఆయన ధ్వజమెత్తారు ఇప్పటికైనా బి ఆర్ ఎస్ నాయకులు తమ ఎమ్మెల్యే పై తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని సహదేవ్ గౌడ్ హెచ్చరించారు ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జానకి రాములు మచ్చగిరి గుట్ట డైరెక్టర్ కూర వెంకన్న వలిగొండ విండో డైరెక్టర్ ఎమ్మె మల్లేశం నాయకులు కాసుల వెంకన్న గౌడ్ పాలకూర వెంకటేశం చిలుకూరు సత్తిరెడ్డి ఉలిపే మల్లేశం తదితరులు పాల్గొన్నారు

## అనారోగ్య బాధితులకు సీఎంఆర్ఎఫ్ అండ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ,ప్రజా స్ఫూర్తి :అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గణపురం, భూపాలపల్లి మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.గణపురం మండలానికి చెందిన 29 మంది లబ్ధిదారులకు రూ.7.13 లక్షలు, భూపాలపల్లి మండలానికి చెందిన 31 మంది లబ్ధిదారులకు రూ.7.03 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వారికి ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా భరోసా కల్పిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ సాయం అవసరమైన వారు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## గంజాయి మొక్కలు పట్టివేత



ప్రజాస్ఫూర్తి,భైంసా:నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని గోడపూర్ గ్రామంలో శుక్రవారం షేక్ నాసిర్ అనే వ్యక్తి వద్ద నుండి గంజాయి మొక్కలను స్వాధీన పరుచుకున్నట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం షేక్ నాసిర్ ఇంటి ముందర పెరటి లో రెండు గంజాయి మొక్కలు ఉన్నట్లు పక్క సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో కలిసి దాడి చేసి రెండు గంజాయి మొక్కలు స్వాధీన పరుచుకొని నసీర్ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ కృష్ణ రెడ్డి తెలిపారు.

## పాంగ్రీ గ్రామం లో వీవో భవనానికి భూమిపూజ



ప్రజాస్ఫూర్తి,భైంసా: నిర్మల్ జిల్లా భైంసా మండలం పాంగ్రీ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న గ్రామ సంఘం (వివో) భవన నిర్మాణానికి భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ షిండే ఆనందరావు పటేల్ గురువారం భూమిపూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. గ్రామీణ మహిళల సాధికారత, స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ఈ భవనం ఎంతోఉపయోగపడుతుందనిఆయనఅన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ గత పదేళ్ల అసమర్థ పాలనలో గ్రామీణ ప్రాంతాలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. సంక్షేమం పేరుతో అప్పుల కుప్పగా మార్చి, అభివృద్ధిని గాలికి వదిలేశారని ఆరోపించారు. అదేవిధంగా బీజేపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, విభజన రాజకీయాలు దేశ అభివృద్ధికి ఆటంకంగా మారాయని, రైతులు, మహిళలు, నిరుపేదల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాలకు అండగా ఉంటుందని, గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆకాష్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, వీవో మహిళా అధ్యక్షురాలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ 1000 రోజుల పరిపాలన వారోత్సవాలు

ప్రజా స్ఫూర్తి,భైంసా: నిర్మల్ జిల్లా కుబీర్ మండలం కేంద్రంలో వెయ్యి



రోజుల కాంగ్రెస్ పరిపాలన వారోత్సవాలు మన తెలంగాణ రాష్ట రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,ఆదేశాల మేరకు మరియు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఆదేశాల మేరకు మరియు నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు ఖానాపూర్ శాసనసభ్యులు యువ నాయకులు వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశానుసారం మాజీ ఎమ్మెల్యే జి.విఠల్ రెడ్డి ఆధ్వర్యంలో మన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ 1000 రోజుల ప్రజా పాలన వారోత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. మాజీ విట్టల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వానికి వెయ్యి రోజులు పూర్తయిందని సంక్షేమం అభివృద్ధి సామాజిక న్యాయం చేసుకుంటూ ప్రజాపాలన మన తెలంగాణ రాష్ట్రం లో ఎంతో విజయవంతంగా నడుస్తుంది అని అన్నారు.

## గ్రామ ప్రజలపై ఆంజనేయు స్వామివారి ఆశీస్సులు ఉండాలి

* **ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి ,షాద్నగర్ : ఫరూక్ నగర్ మండలం మెల్లగూడ గ్రామపంచాయతీలోని కాలనీ తండాలో ఆంజనేయస్వామి విగ్రహా ప్రతిష్టాపన మహోత్సవానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ అభివృద్ధి తన వంతుగా రూపాయలు 50,000 విరాళం అందించారు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందిరి పై ఆంజజనేయ స్వామి వారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఒక్కరి ఇంట ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు నిండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మెల్లగూడ సర్పంచ్ మంగ రవి నాయక్,కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్,పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,మాజీ సర్పంచ్ యారం శేఖర్ రెడ్డి,మెల్లగూడ ఉపసర్పంచ్ పాత్లావత్ రాజు నాయక్,నాయకులు మహిపాల్ గౌడ్,రామునాయక్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బుల్లెట్ రైలు దీక్షకు మద్దతు పలికిన ఉమ్మడి నల్గొండ జిల్లా క్రైస్తవ సంఘాల నాయకులు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట పట్టణ కేంద్రం బతుకమ్మ చౌరస్తా డా. బి. ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద జాతీయ రహదారి 65కు సమాంతరంగా బుల్లెట్ ట్రైన్ మరియు రైల్వే కారిడార్ ఏర్పాటు చేయాలని, దాని సాధన కోసం జరుగుతున్న రిలే నిరాహార దీక్షకు మద్దతుగా ఉమ్మడి నల్గొండ జిల్లా క్రైస్తవ సంఘాల నాయకులు ఉత్తమ సామాజిక సేవా అవార్డు గ్రహీత బిషప్ దుర్గం ప్రభాకర్ పాల్గొని మాట్లాడుతూ ఇప్పటి వరకు సూర్యాపేట జిల్లా ప్రాంతవాసులు రైలు ప్రయాణం నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా కు చుట్టూ వున్నా జిల్లాలు హైదరాబాద్,నల్గొండ, ఖమ్మం, మహబూబాబాద్, యాదాద్రి భోనగిరి, జనగాం, వరంగల్ పట్టణాలకు వెళ్లి ఇతర ప్రాంతాలకు ప్రయాణం చేయాల్సివస్తుందని అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంనకు రైల్వే మార్గం లేకపోవడం ఇక్కడి రాజకీయ నాయకుల వైఫల్యం అనీ అన్నారు. ఈ దీక్ష కు స్వచ్ఛందంగా పార్టీలకు అతీతంగా అన్నీ వర్గాల ప్రజల యొక్క మద్దతూ రోజు రోజుకు పెరుగుతుందని, మరియు రైల్వే సాధన సమితి కొరకు జరుగుతున్న పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియజేశారు. సూర్యాపేటకు మొదట చేసిన అలైన్మెంట్ రూట్ మ్యాప్ ప్రకారం బుల్లెట్ రైలు రావాల్సి ఉండగా కొండమల్లేపల్లి హాలియా సాగర్ మీదుగా మార్చడం అన్యాయం అనీ, దానిని రద్దు చేసి మొదట ప్రకటించిన విధంగా బుల్లెట్ ట్రైన్ ను హైదరాబాద్ చోటుప్పల్, నార్కట్ పల్లి, సూర్యాపేట, కోదాడ మీదుగా విజయవాడ చెన్నైకి నడపాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సి. హెచ్. శ్యామ్ ప్రసాద్,ముల్లంగి జాకబ్ రాజు, జలగం జేమ్స్, చింత మనిషే, పి. మార్క్, కొండేటి లాజర్, యం. రూబెన్, పంది మార్క్, కొమ్ము హోసన్నా, మామిడి క్రిస్టోఫర్, పిట్టల సామెలు, రెంటాల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# బిసి మంత్రిని బర్తరఫ్ చేయడం దుర్మార్గమైన చర్య

* **బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపెందర్**



ప్రజాస్ఫూర్తి ,నల్లగొండ: బీసీ మహిళా మంత్రి కొండ సురేఖను భర్తరఫ్ చేయడం చాలా దుర్మార్గమైన చర్య అని బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపెందర్ అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కట్టెకోలు దీపెందర్ మాట్లాడుతూ కొండా సురేఖను మంత్రి పదవి నుండీ అవమానకరంగా మెడలుపట్టి గెంటెయ్యడమంటే కాంగ్రెస్ పార్టీ నుండి యావత్తు బీసీలను బహిష్కరణకు గురిచెయ్యడమేనన్నారు.రాష్ట్రంలో ఇతర వర్గాల నాయకులకు ఒక న్యాయం బీసీలకో న్యాయమా అని ప్రశ్నించారు. తన కూతురు ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా మాట్లాడితే తన కూతురు వివరణ తీసుకొని పార్టీ పరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి కానీ సురేఖను రాజ్యాంగబద్ధమైన మంత్రి పదవి నుండి భర్తరఫ్ చేయడమేంటనీ ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరాలోచన చేసుకొని బీసీ మంత్రిపై చేసిన బర్తరఫ్ నుఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీసీల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న కాంగ్రెస్ అధిష్టానం కూడా బీసీలను గౌరవించే సాంప్రదాయాలను కొనసాగించాలని లేనిపక్షంలో భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని దీపెందర్ హెచ్చరించారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో నల్గొండ నియోజకవర్గ అధ్యక్షుడు బోళ్ల నాగరాజు, నల్గొండ పట్టణ కార్యదర్శి ముక్కామల శ్రీనివాస్, నాయకులు జక్కలి సాయిరాం, కొడదల శంకర్, విగ్నేష్, రాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చింతన.. భారతీయ సంస్కృతిలో భాగమే:

- **విశాల భారతి పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు**
- **పాఠశాల కరస్పాండెంట్ వీసం చైతన్య క్రాంతి వర్ధన్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఆధ్యాత్మిక చింతన భారతీయ సంస్కృతిలో భాగమేనని విశాల భారతి పాఠశాల కరస్పాండెంట్ వీసం చైతన్య క్రాంతి వర్ధన్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం లోని విశాల భారతి పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చిన్ని కృష్ణుడు, గోపికమ్మల వేషధారణలో ఆటపాటలతో అలరించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉట్లు కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉల్లాసంగా పాల్గొన్నారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ వీసం చైతన్య క్రాంతి వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ శ్రీకృష్ణుని గొప్పతనం గూర్చి వివరించారు. ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంలో భారతీయ సంస్కృతి ఎంతో తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముత్యం శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# వాహనాదారులు తప్పకుండా ట్రాఫిక్ నియమ, నిబంధనలు పాటించాలి: ఎస్ ఐ



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్:ముస్తాబాద్ మండల పరిధిలో శుక్రవారం శాంతిభద్రతల పరిరక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో ఎస్ ఐ జ్యోతి ఆధ్వర్యంలో పోలీసులు మోహరించి ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు తదితర అన్ని రకాల ప్రైవేట్ వాహనాలను ఆపి తనిఖీలు చేపట్టారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలతోపాటు వాహనాల రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న యువకులు, హెల్మెట్ ధరించని వారిపై ప్రత్యేక దృష్టిసారించి నిబంధనలు పాటించని పలు వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ జ్యోతి విలేకరులతో మాట్లాడారు. ప్రజల ప్రాణరక్షణ కోసమే ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిత్యం విస్తృత తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని హెచ్చరించారు.అదేవిధంగా మైనర్ పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ద్విచక్ర వాహనాలు, కార్లు ఇవ్వకూడదని తల్లిదండ్రులను ఎస్ ఐ జ్యోతి హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే ఆ వాహనాల యజమానులపై, తల్లిదండ్రులపై చట్టపరంగా కఠినమైన కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. నేటి యువత ఫ్యాషన్ కోసం, సోషల్ మీడియా రీల్స్ కోసం రోడ్లపై స్టంట్లు చేయడం, రాష్ డ్రైవింగ్‌కు పాల్పడటం మానుకోవాలని హితవు పలికారు. ప్రాణాల కంటే విలువైనది ఏదీ లేదని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించి పోలీసులకు సహకరించాలని ఆమె కోరారు.

# భద్రాచలం ఆలయ పునః నిర్మాణాల్లో వేగం పెంచాలి

: **రాష్ట్ర మంత్రి పొంగులేటి**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:భద్రాచలం ఆలయ నిర్మాణ పనులు ప్రతీ రోజు పకడ్బందీగా చేయాలని, మూడు షిఫ్ట్‌లుగా సిబ్బందిని ఏర్పాటు చేసుకొని 24 గంటలు పని జరిగేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం 25 శాతం పనులే జరిగాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో అలసత్వం వహిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. దేవాదాయశాఖ పై తమకు ఎంతో నమ్మకం ఉందని, నాణ్యత ప్రమాణాలు తగ్గకుండా ఆలయ నిర్మాణాలు జరిపించాలని సూచించారు. శుక్రవారం భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్న అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఆలయానికి తీసుకొనే రాళ్ళ నాణ్యత ఖచ్చితంగా ఉండాలని, మేలిమి కలిగిన వాటిని నిర్మాణాలకు ఉపయోగించాలని సంబంధిత నిర్మాణ సిబ్బందికి తెలిపారు. ఎటువంటి అవసరాలు ఉన్న దగ్గర ఉండీ చూసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీ.ఓ రాహుల్‌ను మంత్రి ఆదేశించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యంతోనే మనకు పోలవరం ముప్పు పొంచి ఉందని పొంగులేటి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి నిర్లక్ష్య వైఖరితో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడు మండలాలను, భద్రాచలం చుట్టుపక్కల ఐదు గ్రామపంచాయతీలను ఆంధ్రాలో విలీనం చేయడం బాధాకరమని అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రస్తుతం వరదలు లేకున్నా భవిష్యత్ లో భద్రాచలం నుంచి ములుగు వరకు సాధారణం కంటే 20-25 అడుగుల వరకు అధికంగా బ్యాక్ వాటర్ ఉ□ధృతి పెరిగే అవకాశం ఉందని, గతంలో సిడబ్ల్యూసి, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థలకు గోదావరి పరీవాహక ప్రాంత ఎమ్మెల్యేలు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ ఈఓ దామోదర్, క్షేత్ర కన్సల్టెంట్ ప్రతినిధులు సత్య కృష్ణ, సూర్యనారాయణమూర్తి, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ శంకుస్థాపన



ప్రజాస్ఫూర్తి , భైంసా:లోకేశ్వరం మండలంలో అభివృద్ధి పనులకు ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ శ్రీకారం చుట్టారు. శుక్రవారం కిస్తాపూర్ గ్రామంలో గోదాము నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు.గ్రామీణ ప్రాంతాల్లో గోదాముల నిర్మాణంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే తెలిపారు. రైతులు పండించిన ధాన్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను సురక్షితంగా నిల్వ చేసుకునేందుకు గోదాములు ఉపయోగపడతాయని, పంటను వెంటనే తక్కువ ధరకు విక్రయించాల్సిన పరిస్థితి తగ్గుతుందని పేర్కొన్నారు. అవసరమైన సమయంలో పంటను విక్రయించుకునే అవకాశం కలగడంతో రైతులకు మెరుగైన ధర లభించేలా గోదాములు దోహదపడతాయని అన్నారు. అనంతరం నర్సింహనగర్ తండాలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అలాగే కొత్తగా నిర్మించనున్న మరో ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ చేశారు. తండాలో గోదాము నిర్మాణానికి కూడా భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేయడంతో పాటు రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల సమస్యలపై పోరాటం ఆగదు

* **మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ,ప్రజాస్ఫూర్తి: సింగరేణి కార్మికుల సమస్యలను తెలుసుకునేందుకు వస్తే గేట్లు వేసి అడ్డుకోవడం సరికాదని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. తనను అడ్డుకున్నా నిజాలు ఆగవని, కార్మికుల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. శుక్రవారం భూపాలపల్లి సింగరేణి ఏరియాలోని 5 ఇంక్లైన్ వద్ద కార్మికులతో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు.కార్మికులకు అవసరమైన షూస్, పనిముట్లు, డ్రిల్ బిట్స్ తదితర సామగ్రి సక్రమంగా అందడం లేదని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కార్మికుల సంక్షేమానికి అనేక చర్యలు చేపట్టామని గండ్ర తెలిపారు. క్వార్టర్ల నిర్మాణం, కార్మికులకు ఇళ్ల పట్టాల సమస్య పరిష్కారానికి ప్రత్యేక జీవో తీసుకురావడం వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తుచేశారు. భూపాలపల్లి అభివృద్ధిలో బస్ డిపో, జూనియర్, డిగ్రీ కళాశాలలు, మెడికల్ కళాశాల ఏర్పాటుతో పాటు విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి కృషి చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో అనేకం ఇంకా అమలు కాలేదని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, పెన్షన్ల పెంపు, రైతు బంధు, రైతు బీమా తదితర హామీలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా సంబరాలు చేసుకోవడం కాదని, ప్రభుత్వం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం ఇదని అన్నారు.కార్మికుల సంక్షేమంతో పాటు సింగరేణి సంస్థ పరిరక్షణకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని గండ్ర వెంకటరమణారెడ్డి కోరారు. కార్యక్రమంలో టిబిజికెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ నాయకులు, టిబిజికెఎస్ నాయకులు పాల్గొన్నారు.

# కృష్ణుడి వేషధారణతో ఆలరించిన విద్యార్థులు

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ పట్టణంలోని లండన్ కిడ్స్ పాఠశాలలో శుక్రవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని,విద్యార్థులు గోపిక కృష్ణా వేషధారణలో అలరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉట్లు కొట్టడం నృత్యాలతో ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బూర పూర్ణచందర్, బూర శరణ్య,ఏవో గాడిపెల్లి సుమన్, ప్రిన్సిపల్ భూక్యా హిమబిందు, కుసుమ మీనాక్షి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# 6న చలో కరీంనగర్ఏఐటియుసి రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

* **ఏఐటియుసి జిల్లా కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డీ పిలుపు**





ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : సెప్టెంబర్ 6, 7, 8 తేదీలలో కరీంనగర్ లో జరుగుతున్న ఏఐటియుసి తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలు జయప్రదం చేయాలని ఏఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నల్లగొండ ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన ఏఐటియుసి నల్గొండ పట్టణ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చేందుకు కార్పొరేట్ దిగ్గజాలకు చట్టబద్ధ శ్రమ దోపిడీకి రెడ్ కార్పెట్ పరుస్తూ కేంద్ర సర్కార్ రద్దుచేసిన 29 కార్మిక చట్టాలను వెంటనే పునరుద్ధరించాలని పల్లా దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగానే కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ సవరణల పేరుతో చట్టాలను తొలగిస్తూ వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లు తీసుకొచ్చారని అన్నారు. కార్మిక హక్కుల సాధనకై సెప్టెంబర్ 6 7 8 తేదీలలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఏఐటియుసి నాలుగో మహాసభలు నిర్వహిస్తున్నామని ఆరవ తారీకు నాడు భారీ ర్యాలీ కార్మిక బహిరంగ సభ జరగనుందని కార్మికులు పెద్ద సంఖ్యల తరలి రావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశం లో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కే ఎస్ రెడ్డి, సహాయ కార్యదర్శి ఎండి జానీ, కోశాధికారి దొనకొండ వెంకన్న, డివిజన్ నాయకులు గుండె రవి, జి నరేందర్ వెంకన్న, నాగార్జున శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మించడమే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కల



ప్రజాస్ఫూర్తి ,షాద్నగర్:రంగారెడ్డి జిల్లా చౌదర్ గూడా మండలం లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ స్థలాన్ని షాద్ నగర్ జేఏసీ నాయకులు సందర్శించారు గతంలో ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు అధికారంలోకి వచ్చి ఎమ్మెల్యే అయితే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ను పూర్తి చేస్తామని ఇచ్చిన హామీని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నిలబెట్టుకున్నారని అదే మాటతో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పట్టుబట్టడంతో 587 కోట్లు భూ సేకరణకు కేటాయించారని వారికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు తెలిపారు అదేవిధంగా నేడు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ గెజిట్ నెం140 ను 191,ఎకరాలకు విడుదల చేశారని ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, మాట్లాడుతూ గత ప్రభుత్వం లక్ష్మిదేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని కేసీఆర్ నుండి మొదలు పెడితే స్థానిక మాజీ ఎమ్మెల్యే వరకు ఇక్కడి రైతాంగాన్ని మోసం చేశారని కానీ అధికారంలోకి వచ్చాక లక్ష్మిదేవిపల్లి రిజర్వాయర్ పూర్తి చేస్తామని ఇచ్చిన హామీని షాద్ నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో జేఏసి నాయకులు జనార్ధన్ వంగురి గంగిరెడ్డి, నర్సన్ గౌడ్, డైరెక్టర్ కరుణాకర్, బాదేపల్లి సిద్దార్థ, గొర్లరాము, గడ్డం జంగయ్య, నర్సింలు గణేష్, నక్క బాల్ రాజ్,కృష్ణయ్య,మందారం నర్సింలు, పరంజ్యోతి, బి. నర్సింలు,తదితరులు పాల్గొన్నారు.

# శిరీష కుటుంబానికి అండగా నిలవాలి

* **ఎమ్మెల్యే కూనంనేని**

ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం:శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి కోటి రూపాయల నష్టపరిహారం అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశాన్ని కల్పించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ములకలపల్లి మండలం చౌటిగూడెంలో శిరీష కుటుంబాన్ని శుక్రవారం కూనంనేని పరామర్శించి, ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ,శిరీష పనిచేసిన ఆస్పత్రిలో సరైన భద్రతా వసతులు లేకపోవడంపై చర్యలు తీసుకోవాలని డీజీపీతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కుటుంబానికి కోటి రూపాయల పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఐదు ఎకరాల భూమి అందించాలని డిమాండ్ చేశారు.అనంతరం సీపీఐ తరపున శిరీష దశదిన కర్మలకు మూడు క్వింటాళ్ల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, నరాటి ప్రసాద్, యండి యూసుఫ్, నరాటి రమేష్, పువ్వాల లలితారావు, అనుముల సాయి, వీరూనాయక్, రంజిత్, ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో గోపికల వేషధారణతో చిన్నారుల సందడి

* **నల్గొండ హౌసింగ్ బోర్డ్ కాలనీలో భక్తిశ్రద్ధలతో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు**



ప్రజాస్ఫూర్తి,నల్గొండ: శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని నల్గొండ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో చిన్నారులు గోపికల వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంప్రదాయ దుస్తులు, ఆభరణాలతో చిన్నారులను అందంగా అలంకరించి శ్రీకృష్ణుడి బాల్య లీలలను ప్రతిబింబించేలా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారులు గోపికల వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారుల ముచ్చటైన వేషధారణ, చిరునవ్వులు, సంప్రదాయ అలంకరణలు వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి. కాలనీ వాసులు, తల్లిదండ్రులు కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను అభినందించారు.శ్రీకృష్ణుని జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం నిర్వహించే కృష్ణాష్టమి వేడుకలు భక్తి, సంప్రదాయం, సంస్కృతికి ప్రతీకగా నిలుస్తాయని నిర్వాహకులు తెలిపారు. చిన్నారుల్లో మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. గోపికల వేషధారణలో చిన్నారుల సందడి చూపరులను విశేషంగా ఆకట్టుకోవడంతో హౌసింగ్ బోర్డ్ కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది.

# నీట్ ఫలితాలలో సత్తాచాటిన గిరిజన బిడ్డ

**ఎంబిబిఎస్ లో సీటు దక్కించుక్న మూడవతు నవ్య**

హుస్నాబాద్ , ప్రజాస్ఫూర్తి:నీటి ఫలితాలలో గిరిజన బిడ్డ సత్తచాటి



ఎంబిబిఎస్ లో సీటు దక్కించుకోవడం పై హుస్నాబాద్ ప్రాంత గిరిజన నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలో అక్కన్నపేట మండలం మసిరెడ్డి తండాకు చెందిన మూడవతు మోహన్ నాయక్ మణెమ్మ ల కూతురు ముడావత్ నవ్య కరీంనగర్ ఫాతిమా మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు పొందింది. ఉన్నత చదువులకు ఎంపికైన గిరిజన బిడ్డ కు పెద్ద ఎత్తున అభినందనలు వెల్లువెత్తాయి.ప్రస్తుతం నవ్య తల్లి మసిరెడ్డి తండా గ్రామానికి సర్పంచ్ గా పనిచేస్తున్నారు.ఉన్నత చదువులకు ఎంపికైన గిరిజన బిడ్డ మూడవతు నవ్య ఉన్నత స్థాయికి ఎదిగి గిరిజనులకు వైద్య సేవ చేయాలని గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పెద్దతండ గ్రామ సర్పంచ్ గుగులోతు డాక్టర్ తిరుపతి నాయక్ నవ్యను సన్మానించి అభినందించారు.

# గాంధీ కాలనీలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి ఉట్టి కొట్టు వేడుక



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం:చుచుపల్లి మండలం గాంధీ కాలనీ నందు శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.కృష్ణాష్టమి సందర్భంగా భక్తుల చేత ఉట్టి కొట్టు వేడుకలు వైభవంగా నిర్వహించారు. చిన్నారులు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగం మాధవరావు , రేగల్ల రవికుమార్ , కదిరి నరసింహారావు , రూపాన నరసింహారావు , శీలం విజయ్ , బొల్లం సాగర్ , బొల్లి సాయి , చింతాల సాయికిరణ్ , ఇట్టే సత్యనారాయణ , బంగారి శంకర్ , భాస్కర్ తదితరులు పాల్గొన్నారు .

# నేడే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు డ్రా

* **5,081 దరఖాస్తుల్లో 174 ఇళ్ల కేటాయింపు.. ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లో లాటరీ**



జనగామ, ప్రజాస్ఫూర్తి : పట్టణ మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధి దారులకు ఇళ్ల కేటాయింపు కోసం శని వారం డ్రా నిర్వహించనున్నారు.మొత్తం 5,081 మంది దరఖాస్తుదారుల్లో 174 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లాటరీ పద్ధ తిలో కేటాయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.ఇప్పటికే లబ్ధిదారుల జాబితాను మున్సిపల్ కార్యాలయ నో టీస్ బోర్డులో ప్రదర్శించినట్లు అధికారు లు తెలిపారు. దరఖాస్తుదారులు తమ పేర్లు జాబితాలో ఉన్నాయో లేదో ము న్సిపల్ కార్యాలయంలో పరిశీలించుకో వాలని సూచించారు. సెప్టెంబర్ 5న ఉ దయం 9 గంటలకు జిల్లా కలెక్టరేట్ లో డ్రా ప్రక్రియ నిర్వహించనున్నట్లు పట్టణ తహసీల్దార్ కార్యాలయం వెల్లడించిం ది. సంబంధిత దరఖాస్తుదారులు నిర్ణీ త స మయానికి హాజరై డ్రా ప్రక్రియను పరిశీలించాలని అధికారులు కోరారు.

# ప్రజా పాలనలో పేదలకు లబ్ధి

* **నల్గొండ డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత**




ప్రజాస్ఫూర్తి, నల్లగొండ :తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో నిరుపేదలకు లబ్ధి జరుగుతుందని నల్గొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత అన్నారు. శుక్రవారం నాడు జిల్లా కేంద్రంలోని శివాజీ నగర్ నుండి క్లాక్ టవర్ వరకు 1000 రోజుల్లో సాధించిన విజయాలపై వికాస యాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అగ్ర కుల పెద్దల అభ్యున్నతికై కృషి చేస్తున్నారని దళిత బహుజన ఆత్మీయ బంధువు గా మారారని కొనియాడారు.నిరుపేదలకు సన్న బియ్యం,5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు,2 లక్షల రుణమాఫీ, 200యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం,వడ్డీలేని రుణాలు,ఇందిరమ్మ చీరలు లాంటి అద్భుతమైన పథకాలు దేశానికి ఆదర్శమైన సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి పేదల గుండెల్లో నిలిచారని అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి రాష్ట్రాన్ని లూటీ చేసిన దోపిడి దొంగల ముఠా నేడు తెలంగాణలో నిరసనలు తెలిపే నైతిక హక్కులేదన్నారు.1000 మంది కార్యకర్తలతో వికాస యాత్ర* నిర్వహించిన అనంతరం క్లాక్ టవర్ వద్ద కేక్ కట్ చేసి బాణాసంచ కాల్చి విజయోత్సవాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు జిల్లపల్లి పరమేష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బోడ స్వామి,మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గోపగని మాధవి, జిల్లా ఉపాధ్యక్షులు ఎండి ముంతాజ్ అలీ, ప్రధాన కార్యదర్శులు పోసిరెడ్డి సంతోష్ రెడ్డి,మేకల రాజేందర్ రెడ్డి,గోపిశెట్టి రాంబాబు, ఏళ్ల రవీందర్ రెడ్డి,కుకుడాల బాలకృష్ణ,జిల్లా కార్యదర్శులు చర్లపల్లి గౌతమ్,దామనూరి అశోక్,కాసిరెడ్డి నరేష్,దేవరకొండ మున్సిపల్ చైర్మన్ పున్న వెంకటేశ్వర్లు,కొండమల్లెపల్లి సర్పంచ్ యుగంధర్ రెడ్డి,చింతమల్ల వెంకటయ్య,కాటం వెంకన్న,మధుప్రసాద్,వవిల్ల దేవదాస్,పులెంల సందీప్,కుర్వాటి గణేష్,వేముల గోపీనాథ్,ఇందనూరి శ్రీను,కోరే శివ, బాలం మహేష్,గణపురం మహేష్,కత్తుల గణేష్, ఐ ఎన్ టి యు సి.ఎన్ఎస్ యుఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు,కౌన్సిలర్లు,అనుబంధ సంఘా నాయకులు తదితరులు పాల్గొన్నారు...

# కుమారుడు, కూతుర్లకు మొక్కలతో పుట్టినరోజు శుభాకాంక్షలు

* **హరిత మిత్ర అవార్డు గ్రహీత,ప్రకృతి ప్రేమికుడు. దైద వెంకన్న**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ పట్టణానికి చెందిన ప్రకృతి ప్రేమికుడు, హరిత మిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న స్రవంతి ల కుమారుడు హర్షిత్,కూతుర్లు హర్షిత,హర్షిక జన్మదినం సందర్బంగా వారికి శుభాకాంక్షలు తెలిపి అనంతరం తల్లిదండ్రులు వారికి గులాబీ మొక్కలు బహుకరించారు.వీరి ప్రతి పుట్టిన రోజును పురస్కరించుకొని మొక్కలు ఇస్తూ ఉంటారు.ఇప్పటి వరకు వీరు నాటిన మొక్కలు 132 మొక్కలు ఉన్నాయి.అంతరించి పోతున్నా జీవ వైవిద్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మన అందరి పైన ఉంది.చెట్లు లేకుంటే రాబోయే రోజులల్లో ప్రకృతి వైపారీత్యాల వాళ్ళ మానవ జీవితం అతరించి పోయే ప్రమాదం ఉండి.మొన్నటికి మొన్న నేపాల్లో ఏమి జరిగిందో అందరికి తెలుసు ఎప్పటికైనా ప్రకృతిని కాపాడుకుందాం,ఇంటికొక చెట్టును పెంచుదాం అని పిలుపునిచ్చారు.

# అక్టోబర్ 25న ప్రపంచవ్యాప్తంగా ‘’ విడుదల

* **ఘనంగా ‘జయహో రామానుజ’ పాట లాంచ్ కార్యక్రమం.**
* **సాంగ్ లాంచ్ కు హాజరైన ప్రముఖులు.**



నగామ, ప్రజాస్ఫూర్తి : రామానుజుల జీవిత విశేషాలు,ఆధ్యాత్మిక సందేశాన్ని ప్రతిబింబించేలా తెరకెక్కుతున్న ‘జయ హో రామానుజ’ చిత్రానికి సంబంధించి న పాట లాంచ్ కార్యక్రమం జిల్లా కేంద్రం లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్ర మానికి యాదాద్రి లక్ష్మి నరసింహ స్వా మి దేవాలయ బోర్డు సభ్యులు డాక్టర్ ల క్ష్మీ నారాయణ నాయక్ ముఖ్య అతిథి గా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్ష లు తెలిపారు. ఈ సందర్భంగా చిత్ర పాట ను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా చిత్రాన్ని అక్టోబర్ 25న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయ నున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. రా మానుజుల ఆధ్యాత్మిక తత్వం, సమా జానికి ఆయన అందించిన సందేశాన్ని ప్రజలకు చేరువ చేసే విధంగా ఈ చిత్రా న్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు.కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ ఓబీసీ స్టేట్ కన్వీ నర్ మల్లేష్, టి.ఎఫ్.సీ.సీ చైర్మన్ డాక్టర్ ప్రతాని రామకృష్ణ గౌడ్, చిత్ర నిర్మాత శ్రీనివాస్, నిర్మాత సప్పిడి సత్యనారాయ ణ, మోహన్ గౌడ్,ఐశ్వర్య సిల్క్స్ ఎం.డీ నాగలక్ష్మి, ప్రముఖ దర్శకుడు సముద్ర, అన్నపూర్ణ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫె సర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అతిథులను చిత్ర బృందం శాలువాలతో ఘనంగా సత్కరించింది. ‘జయహో రామానుజ’ చిత్రం ప్రేక్షకుల ను ఆకట్టుకోవడంతో పాటు రామాను జుల గొప్పతనాన్ని నేటి తరానికి పరిచ యం చేస్తుందని నిర్వాహకులు ఆశాభా వం వ్యక్తం చేశారు.

# హామీలు అమలు చేయాలి.. లేదంటే ప్రజల తిరుగుబాటు తప్పదు

* **కాంగ్రెస్ ప్రభుత్వంపై కంచర్ల భూపాల్‌రెడ్డి ధ్వజం**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి :కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనకు నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద వంటావార్పు నిర్వహించారు. మహిళలు, దివ్యాంగులు, వృద్ధులు, విద్యార్థినులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రేపు నకిరేకల్‌కు వస్తున్నారని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన ఆస్పత్రి ప్రారంభోత్సవానికి హాజరవుతున్నారని అన్నారు. నకిరేకల్‌కు వచ్చే ముందు మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, రైతులు, కౌలు రైతులకు ఎకరాకు రూ.15 వేల రైతుభరోసా, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకుంటే ప్రజల నుంచి తీవ్ర నిరసన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కేసీఆర్ కిట్, గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనపెట్టిందని విమర్శించారు. కార్యక్రమంలో కంచర్ల కృష్ణారెడ్డి, కటికం సత్తయ్యగౌడ్, మాలే శరణ్యరెడ్డి, రెగట్టే మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, భువనగిరి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం దోపిడీ చేస్తోంది

: **తలసాని శ్రీనివాస్ యాదవ్**

* **సీఎం రేవంత్‌రెడ్డి పై మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఫైర్.**



జనగామ ప్రజాస్ఫూర్తి : హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఇబ్బందుల కు గురిచేస్తూ దోపిడీకి పాల్పడుతోందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాద వ్ తీవ్రంగా విమర్శించారు. జిల్లా కేంద్రం లో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వే డుకలకు హాజరయ్యేందుకు వచ్చిన ఆయన, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసి న మీడియా సమావేశంలో తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభు త్వ పాలన పై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని అన్నారు. రాష్ట్ర ప్రజలు ఈ దుర్మార్గపు పాలనకు ఎప్పుడు ముగిం పు వస్తుందా అని ఎదురుచూస్తున్నార ని వ్యాఖ్యానించారు. ప్రజలు మరోసారి కేసీఆర్ పాలన రావాలని కోరుకుంటు న్నారని, ఇంకా రెండేళ్లు గడిస్తే తెలంగా ణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం లోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.తెలంగాణలో ప్రతి గ్రామానికి వైకుంఠ ధామం, గ్రామానికి ఒక ట్రాక్టర్ వంటి కార్యక్రమాలను అమలు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని తలసాని పేర్కొన్నారు. అసెంబ్లీ లో ప్రతిపక్షంగా ప్రజల తరపున తాము ప్రశ్నలు అడిగితే ప్రభుత్వం సమాధానం చెప్పకుండా తప్పించుకునే పరిస్థితి ఎం దుకు వచ్చిందని ప్రశ్నించారు.రాష్ట్ర పరి పాలనపై దృష్టి పెట్టాల్సిన ముఖ్యమం త్రి విహారయాత్రలకు ప్రాధాన్యత ఇస్తు న్నారని తలసాని విమర్శించారు. కాం గ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యల పై దృష్టి సారించి, ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా నలుగురు ఎంపిక



ప్రజాస్ఫూర్తి: శ్రీరంగాపురం, వనపర్తి జిల్లా:సెప్టెంబర్ 5 సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం పురస్కరించుకొని ప్రతి సంవత్సరం జాతీయ ఉపాధి దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో శ్రీరంగాపురం మండల పరిధిలోని నలుగురు ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్స్ కు ఎంపికయ్యారు. మండల పరిధిలోని నాగసానిపల్లి ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు నరేష్ , తాటిపాముల యుపిఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు శ్రావణ్, శ్రీరంగాపూర్ జడ్.పి.హెచ్.ఎస్ ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు మేఘా రెడ్డి, వెంకటాపూర్ ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు శివశంకర్ ఎంపికయ్యారు. సెప్టెంబర్ 5వ తేదీన జిల్లా కేంద్రంలో జరిగే సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి చేతుల మీదుగా అవార్డ్స్ అందుకొనున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు.

# గరిడేపల్లి లో ఘనంగా కనకదుర్గమ్మ పండుగ

* **రంగురంగుల పూలతో ఆకర్షణీయంగా నిలిచిన అమ్మవారి ప్రభలు**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: మండలంలోని గరిడేపల్లి గ్రామంలో కనకదుర్గమ్మ పండు గ అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో ప్రభ బండ్లతో మేళ తాళాలతో పప్పు పలహారాలతో కోళ్లు యాటలతో గ్రామంలో ఊరేగింపు గా బజబజారు తిరుగుతూ కనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు అనంతరం వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య గౌడ్ వార్డ్ మెంబర్లు మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు మాజీ వార్డ్ నెంబర్లు గ్రామ ప్రజలు గ్రామ యూత్ అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# స్మశాన వాటిక అభివృద్ధికి నడుం బిగించిన పాకనాటి రెడ్డి సంఘం నాయకులు

చిగురుమామిడి,ప్రజాస్ఫూర్తి:చిగురుమామిడి మండల కేంద్రంలోని పాకనాటి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో స్మశాన వాటిక అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.ఈ సందర్భంగా 15గుంటల విస్తీర్ణంలో ఉన్న ఈ స్మశాన వాటిక చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి 5లక్షల రూపాయల నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ను సంఘం ప్రతినిధులు కోరుతున్నారు.ఈ స్మశాన వాటిక కోసం మడమడకల సుందరమ్మ లచ్చిరెడ్డి దంపతులు 5గుంటల స్థలాన్ని పాకనాటి రెడ్డి సంఘానికి గతంలో విరాళంగా అందజేయగా సంఘం సభ్యులు మరో 10గుంటల స్థలాన్ని స్వయంగా కొనుగోలు చేసినట్లు వివరించారు. మొత్తంగా 15గుంటల స్థలంలో అభివృద్ధి పనులను ప్రారంభించారు.ప్రహరీ గోడ నిర్మాణానికి ప్రభుత్వ సహాయం అందిస్తే ఈ స్థలం మరింత భద్రంగా మారుతుందని వారు మంత్రిని కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు పన్యాల నాగిరెడ్డి,ఉపాధ్యక్షులు మనమడకల శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోలుగూరు వెంకటరమణారెడ్డి, కోశాధికారి కొమ్మూరి రవీందర్ రెడ్డి,సహాయ కార్యదర్శి మడమడకల మహేందర్ రెడ్డి,సంఘం సభ్యులు పన్యాల శ్రీనివాస్ రెడ్డి,పన్యాల రాజిరెడ్డి, పన్యాల తిరుమలరెడ్డి తదితరులు ఉన్నారు.





# పండ్లను కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలి..?

**పండ్లు మన ఆరోగ్యానికి ఎంత మంచివో మనందరికీ తెలుసు. డాక్టర్లు సైతం ఆహారంలో పండ్లను చేర్చుకోవాలని చెబుతారు. కానీ చాలా మంది పండ్లను కోసి కొన్ని గంటల తర్వాత తింటారు. అయితే కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. లేకపోతే అది మన శరీరం పై చెడు ప్రభావాన్ని చూపుతుంది.**

పండ్లు మన శరీరానికి మంచివని అందరికీ తెలుసు. ప్రతిరోజ పండ్లను తినడం ఆరోగ్యానికి మంచిది. విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ వంటివి పండ్లలోసమృద్ధిగా ఉంటాయి. పండ్లు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో పండ్లను చేర్చుకోవాలని వైద్యులు సూచిస్తారు. కొన్నిసార్లు మనం పండ్లను కోసి అలాగే ఉంచుతాం. ఆఫీసులు, ఏదైన ప్రయాణ సమయాల్లో కోసి తీసుకెళ్తుంటారు. కొంతమంది కోసి ఫ్రిజ్‌లో పెడతారు. కొన్ని గంటల తర్వాత వాటిని తింటారు. కానీ కోసిన పండ్లను ఎంతసేపట్లో తినాలి..? అవి ఎంతకాలం మంచిగా ఉంటాయి అనేది చాలా మందికి తెలియదు. ఇవి తెలుసుకోవడం చాలా ముఖ్యం.

### పండ్లు తినడానికి సరైన సమయం ఏమిటి?

పండ్లను ఏ సమయంలో తిన్న మంచిదేనని నిపుణులు అంటున్నారు. అయితే కొన్నింటిని ఉదయం ఖాళీ కడుపుతో, మరికొన్నింటిని రాత్రి వేళలో తినకూడదని చెబుతారు. ఏదైనా సరే మితంగా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని అంటున్నారు.

### కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలి..?

కోసిన వెంటనే పండ్లు చెడిపోవు. కానీ వాటిని ఎంత త్వరగా తింటే అంత మంచిది. నిజానికి కోసిన పండ్లలో ఇన్ఫెక్షన్ ప్రమాదం పెరుగుతుంది. వేసవి, వర్షాకాలం సూక్ష్మజీవుల పెరుగుదలకు ఉత్తమ సమయాలు. కోసిన పండ్ల వల్ల ఇన్ఫెక్షన్ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఎక్కువసేపు నిల్వ చేయకుండా వీలైనంత త్వరగా వాటిని తినాలి. పండ్ల నుండి అన్ని పోషకాలను పొందడానికి వాటిని కోసిన అరగంటలోపు తినడం ఎల్లప్పుడూ మంచిదని అంటున్నారు.



# ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల కిడ్నీలు శుభ్రం, ఆరోగ్యం

మన శరీరంలో ఎప్పటికప్పుడు ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను కిడ్నీలు మూత్రం ద్వారా బయటకు పంపిస్తాయి. దీంతో శరీరంలో వ్యర్థాలు పేరుకుపోకుండా ఉంటాయి. ఆరోగ్యంగా ఉంటాము. అయితే మనం పాటించే ఆహారపు అలవాట్లు, జీవనశైలి, దీర్ఘకాలిక వ్యాధులు, వాడే మందులు వంటి కారణాల వల్ల మన కిడ్నీల పనితీరు మందగిస్తుంది. దీంతో వ్యర్థాలను కిడ్నీలు సరిగ్గా బయటకు పంపలేకపోతాయి. దీని వల్ల దీర్ఘకాలంలో శరీరంలో వ్యర్థాలు పేరుకుపోతాయి. ఇవి అనేక వ్యాధులను కలగజేస్తాయి. అందువల్ల కిడ్నీలను మనం ఆరోగ్యంగా ఉంచుకోవాలి. కిడ్నీలు ఎప్పటికప్పుడు వ్యర్థాలను బయటకు పంపిస్తూ శుభ్రంగా ఉండాలి. అప్పుడే మనం ఆరోగ్యంగా ఉంటాం. అయితే పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల కిడ్నీలను శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. దీని వల్ల ఇతర వ్యాధులు రాకుండా కూడా అడ్డుకోవచ్చు.

### కొబ్బరినీళ్లు, యాపిల్ సైడర్ వెనిగర్..

కొబ్బరినీళ్లను రోజూ తాగడం వల్ల శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. దీని వల్ల శిరోజాలు, చర్మం సురక్షితంగా, ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే కిడ్నీ సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చు. కిడ్నీలు శుభ్రంగా మారుతాయి. కొబ్బరినీళ్లలో ఉండే ఎలక్ట్రోలైట్స్ కిడ్నీలను సురక్షితంగా ఉంచుతాయి. అలాగే కిడ్నీల ఆరోగ్యానికి యాపిల్ సైడర్ వెనిగర్ కూడా పనిచేస్తుంది. రోజూ ఉదయం పరగడుపునే ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో ఒక టీస్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్ కలిపి తాగుతుంటే కిడ్నీలు క్లీన్ అయి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే బరువు తగ్గేందుకు కూడా ఇది ఎంతగానో పనిచేస్తుంది. షుగర్, కొలెస్ట్రాల్ స్థాయిలను సైతం అదుపులో ఉంచుతుంది. ఇక కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచేందుకు గాను పలు పండ్లు కూడా సహాయం చేస్తాయి. స్ట్రాబెర్రీలు, చెర్రీలు, యాపిల్స్, క్రాన్ బెర్రీలు, ద్రాక్ష, పైనాపిల్ వంటి పండ్లను తింటుంటే మేలు జరుగుతుంది.

### ఈ ఆహారాలు కూడా అవసరమే..

అరటి పండ్లు, నారింజ పండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది శరీరంలోని సోడియం స్థాయిలను తగ్గిస్తుంది. దీని వల్ల కిడ్నీలు శుభ్రంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే కాలిఫ్లవర్, క్యాబేజీ, ఎరుపు రంగు క్యాప్సికం, ముల్లంగి వంటి కూరగాయలను తింటున్నా కూడా కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. కోడిగుడ్డు తెల్ల సొన, స్కిన్ లెస్ చికెన్, చేపలు, ఆలివ్ ఆయిల్, వెల్లుల్లి, ఉల్లిపాయలు వంటి ఆహారాలను కూడా తీసుకోవచ్చు. అయితే కిడ్నీలు ఎల్లప్పుడూ శుభ్రంగా, ఆరోగ్యంగా ఉండేందుకు గాను ఆహారంలో ఉప్పు తీసుకోవడం తగ్గించాలి. సోడియం తక్కువగా ఉండే ఆహారాలను తినాలి. మద్యం సేవించడం, పొగ తాగడం మానేయాలి. ఆకుకూరలు, కూరగాయలను, పండ్లను తినేందుకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలి. అలాగే రోజూ నీళ్లను తగిన మోతాదులో తాగాలి. ఇలా ఆహారపు అలవాట్లను పాటిస్తుంటే కిడ్నీలు శుభ్రంగా ఆరోగ్యంగా ఉంటాయి.

### బీట్ రూట్, నిమ్మరసం..

మనం బీట్‌రూట్‌ను అప్పుడప్పుడు తింటుంటాం. కానీ బీట్‌రూట్‌ను రోజువారి ఆహారంలో కచ్చితంగా భాగం చేసుకోవాలి. బీట్ రూట్‌లో పొటాషియం, నైట్రేట్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి కిడ్నీలను శుభ్రం చేసి ఆరోగ్యంగా ఉంచుతాయి. రోజూ ఒక కప్పు బీట్ రూట్ ముక్కలను తింటుండాలి. లేదా ఒక కప్పు బీట్ రూట్ జ్యూస్‌ను అయినా తాగవచ్చు. దీని వల్ల కిడ్నీల ఆరోగ్యం మెరుగుపడుతుంది. అలాగే కిడ్నీల ఆరోగ్యానికి నిమ్మరసం కూడా ఎంతగానో పనిచేస్తుంది. నిమ్మరసంలో విటమిన్ సి ఉంటుంది. కిడ్నీ స్టోన్లు ఏర్పడకుండా రక్షిస్తుంది. అదేవిధంగా అల్లం రసం కూడా ఎంతగానో మేలు చేస్తుంది. రోజూ ఉదయం పరగడుపునే అల్లం రసాన్ని ఒక టీస్పూన్ మోతాదులో తాగుతుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.



# పొద్దునే ప్రొటీన్ ఫుడ్

పొద్దుననిద్ర లేచిన వేళా విశేషమే రోజంతటినీ నిర్ణయిస్తుంది. పొద్దునే మన టిఫిన్లలో ఇడ్లీ, పోహా, ఉప్మా, ఆలూ పరాఠా లాంటివి ప్రధానంగా ఉంటాయి. ఇవన్నీ కార్బొహైడ్రేట్లతో నిండి ఉంటాయి. కానీ ఆరోగ్యానికి అత్యవసర పోషకమైన ప్రొటీన్ ఉండదు. అయితే, ఉపాహారం నుంచే 20 గ్రాముల ప్రొటీన్ అందేలా చూసుకుంటే మంచిది. అలాగని ప్రొటీన్ పౌడర్ల మీద ఆధారపడకూడదు. ఆహారంలో కొన్ని చిన్న మార్పులు చేసుకుంటే సరిపోతుంది. పొద్దునే ఆరగించడానికి ప్రొటీన్లతో సమృద్ధమైన టిఫిన్లు కొన్నిటి గురించి తెలుసుకుందాం.

శరీర విధులు సాఫీగా సాగాలంటే ప్రొటీన్లు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. శరీర కణజాలం, కండరాలు, ఎముకలు, చర్మం, వెంట్రుకలు, గోళ్ల నిర్మాణంలో ప్రొటీన్లు కీలకంగా నిలుస్తాయి. ఎంజైముల విడుదలలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. అంతేకాదు ప్రొటీన్లు మన రోగ నిరోధక వ్యవస్థలో అంతర్భాగం. ప్రొటీన్లు తీసుకుంటూ తగినంత వ్యాయామం చేస్తే ఆరోగ్యకరమైన జీవితం సొంతమవుతుంది. ప్రొటీన్లు శరీరానికి మాత్రమే కాదు మెదడు పనితీరుకు కూడా అండగా నిలుస్తాయి.

### పల్లీలు కూరగాయలతో క్వినోవా ఉప్మా

ఓ కప్పు క్వినోవాలో 8 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. దీనికి కూరగాయలు, కరివేపాకు, ఓ టేబుల్ స్పూన్ వేయించిన పల్లీలు, పచ్చి బఠాణీలు కలపాలి. ఉడికించిన శనగలతో సలాడ్ తీసుకుంటే మొత్తం 22 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి. ఒక్క క్వినోవా ఉప్మా, కూరగాయలు, పల్లీల నుంచే 17 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### శనగపిండి టోస్ట్, టోఫు బుర్జి

రెండు బ్రెడ్ పకోడీలు (శనగపిండితో చేసినవి) తీసుకోవాలి. దీనికి 75 గ్రాముల టోఫు బుర్జీ జతచేయాలి. టమాటాలు, పసుపు, జీలకర్ర కలపాలి. దీని ద్వారా 23 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### రాజ్మా పరాఠా, కప్పు పెరుగు

మామూలుగా రాజ్మా లంచ్‌కే అనుకుంటారు. కానీ ఓ కప్పు రాజ్మాను ఉడికించి ముద్దగా చేసుకోవాలి. దాన్ని పరాఠా స్టఫ్‌గా వాడుకోవాలి. ఇలా చేస్తే 15 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని పుదీనా, సైంధవ లవణం కలిపిన హంగ్ కర్డ్ (నీళ్లు తీసేసిన పెరుగు)లో అద్దుకుని తినేయాలి.

### సత్తు పరాఠా, ఉడికించిన గుడ్డు, బటర్ మిల్క్

సత్తు అంటే వేసవి పానీయం మాత్రమే కాదు. 100 గ్రాముల సత్తులో 20 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. కాబట్టి, కొద్దిగా నెయ్యి వేసి సత్తు పరాఠా చేసుకోవాలి. తినే వాళ్లయితే దీంతోపాటు ఓ ఉడికించిన గుడ్డు తినాలి. గ్లాసెడు బటర్ మిల్క్ తాగాలి. రెండు మోస్తరు సత్తు పరాఠాల నుంచి 14 గ్రాములు, ఉడికించిన గుడ్డు నుంచి 6 గ్రాములు, బటర్‌మిల్క్ నుంచి 2 గ్రాములు.. మొత్తంగా 22 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### మూంగ్‌దాల్ చిల్లా పనీర్ ఫిల్లింగ్

ఒక్కో చిల్లా (దోశ లాంటిది)లో 5 6 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. వీటిలో నింపే 50 గ్రాముల తురిమిన పనీర్ నుంచి 9 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి. రెండు చిల్లాలను ఓ కప్పు పెరుగుతో లాగించేయాలి. పెరుగుతో లభించే 5 గ్రాములతో కలుపుకొని మొత్తం 26 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### మొలక పెసర్లు ఓట్స్ చీలా

ఇది కూడా దోశలా చేసుకునేదే. అరకప్పు ఓట్స్‌లో 5 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని ఓ కప్పు పెసర మొలకలతో కలిపితే మరో 14 గ్రాములు లభిస్తాయి. దీనికి కాస్త శనగపిండిని జోడిస్తే మరో 2 గ్రాములు మొత్తంగా 21 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి.





# పోస్టర్‌తో రూమర్లకు చెక్

మెగాస్టార్ చిరంజీవి కాకా మూవీ సంక్రాంతి రేసు నుంచి తప్పుకున్నట్లు వస్తున్న వార్తలకు మేకర్స్ చెక్ పెట్టారు. షూటింగ్ అప్‌డేట్‌ను కూడా రివీల్ చేశారు. ఈనెల 7 నుంచి హైదరాబాద్‌లో ఓ కీలక షెడ్యూల్ మొదలు కాబోతున్నట్లు ప్రకటించారు. శుక్రవారం ఈ సినిమా నుంచి వర్కింగ్ స్టిల్‌ను రిలీజ్ చేశారు. ఇందులో చిరంజీవితో ఓ సీన్ గురించి సీరియ స్‌గా డిస్కస్ చేస్తూ డైరెక్టర్ బాబీ కనిపిస్తుండగా ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరలవుతోంది. ఈ మూవీలో చిరంజీవి డ్యూయల్ రోల్ అల రించబోతున్నారు. జనవరి 13నే ఈ మూవీ విడుదల కానున్నట్లు వెల్లడించారు. ఈ మూవీకి థమన్ మ్యూజిక్ అందిస్తుండగా వెంకట్ కే నారాయణ నిర్మిస్తున్నారు.






# యాక్షన్ రోల్‌లో అనన్య



లీసా పేరుతో ఓ సైకలాజికల్ థ్రిల్లర్ మూవీలో హీరోయిన్‌గా నటిస్తోంది అనన్య నాగళ్ల. ఇప్పటివరకు సాఫ్ట్ రోల్స్‌లో కని–పించిన అనన్య ఇందులో యాక్షన్ ప్రధానంగా సాగే పాత్రలో కని పించబోతున్నట్లు సమాచారం. ఆమె క్యారెక్టర్‌కు సంబంధించి వచ్చే ట్విస్ట్‌లు లీసాకు హైలైట్‌గా ఉం డబోతున్నట్లు చె బుతున్నారు. రష్మిక మందన్న సొంతూరు విరాజ్‌పేట నేపథ్యంలో ఈ తెలుగు సినిమా కథ సాగుతుందని అంటున్నారు. లీసా షూటింగ్ పూర్తి కాగా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. నవంబ ర్‌లో థియేటర్లలో ఈ సినిమాను రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ మ్యూజిక్ అందిస్తున్న ఈ మూవీకి జవహర్ పవార్ దర్శకత్వం వహిస్తున్నారు.

# లేడీ సూపర్‌స్టార్‌పై ట్రోల్స్

సొంత సినిమా కోసం గత 10 ఏళ్లుగా పాటిస్తోన్న ఓ రూల్‌ను బ్రేక్ చేసింది నయనతార. ఆమె హీరోయి న్‌గా నటిస్తూ నిర్మించిన తమిళ మూవీ హాయ్ ఇటీవలే రిలీజైంది. ఈ సినిమా కోసం కెరీర్‌లో ఫస్ట్ టైమ్ సినిమా ఆడుతున్న థియేటర్లను సందర్శించింది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా చెన్నైతో పాటు తిరుచ్చి, మధు రైలోని కొన్ని థియేటర్లను నయన్ సందర్శించిం ది. లేడీ సూపర్ స్టార్‌ను థియేటర్లలో చూసిన ఆడియెన్స్ సర్‌ప్రైజయ్యారు. సినిమాల ప్రమోషన్స్ విషయంలో మారిపోయిందంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. డబ్బులు పోతాయనే భయంతోనే ఇలా ప్రమోట్ చేస్తుందని మరికొందరు అంటున్నారు. దాదాపు 20 కోట్ల బడ్జెట్‌తో స్వయంగా ఈ మూవీని నిర్మించింది నయన్.

## ఈ వారం ఓటీటీలో రిలీజైన సినిమాలు, వెబ్‌సిరీస్‌లు ఇవే

| | |
|---|---|
| **నెట్‌ఫ్లిక్స్ :** | కొరియన్ కనకరాజు (తెలుగు)<br>జీడీఎన్ (తెలుగు)<br>గాంధారి (హిందీ)<br>ధమాల్ 4 (హిందీ)<br>టర్నింగ్ పాయింట్ (ఇంగ్లీష్) |
| **అమెజాన్ ప్రైమ్ వీడియో:** | జగమే సంగీతం వెబ్ సిరీస్ (తెలుగు)<br>పళ్లబురుసు (తెలుగు)<br>అనంతన్‌కాడు (మలయాళం)<br>అరుళ్‌వాన్ (తమిళం)<br>రక్కీ (కన్నడ)<br>కన్వెన్‌మెంట్ (ఇంగ్లీష్)<br>ది రన్నర్ (ఇంగ్లీష్) |
| **సోనీ లివ్:** | ఉన్మాదం (మలయాళం)<br>బ్యాక్‌రూమ్స్ (ఇంగ్లీష్) |
| **సన్ నెక్స్ట్:** | డీసీ (తమిళం) |
| **జియో హాట్ స్టార్:** | ది కోర్ట్ వెబ్ సిరీస్ (తమిళం)<br>స్టార్ వార్స్ (ఇంగ్లీష్) |
| **ఈటీవీ విన్:** | జ్ఞాపకాలు (తెలుగు) |

# టైం లేకపోవడం వల్లే పోలే

తమిళ మూవీ ఇమ్మోర్టల్ ప్రమోషన్స్‌కు కయదు లోహర్ దూరంగా ఉండటంపై కోలీవుడ్ ఫ్యాన్స్ ట్రోల్ చేస్తున్న వేళ ఈ కాంట్రవర్సీపై ఆమె రియాక్ట్ అయ్యింది. ఈ విమర్శల వెనుక రాజకీయాలు, పీఆర్ గేమ్స్ ఉన్నాయి. అలాంటివి చేయడం నాకు రాదు. ఐ యామ్ గేమ్ కోసం ఎంత కష్టపడ్డానో ఇమ్మోర్టల్ కోసం అంతే శ్రమించా. కేవలం ప్రమోషన్స్‌కు అటెండ్ కాలేదనే సాకుతో నన్ను టార్గెట్ చేస్తున్నారు.సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్, మీమ్స్‌ను అస్సలు పట్టించుకోను. ఇమ్మోర్టల్ ప్రమోషన్స్‌కు హాజరు కావాలని అనుకున్నా. కానీ అప్పటికే ఉన్న కమిట్‌మెం ట్స్, టైమ్ లేకపోవడం వల్ల కుదరలేదు. అంతే తప్ప దీని వెనుక ఎలాంటి దురుద్దేశం లేదు. నాకు తమిళం, మలయాళం, తెలుగు అనే భేదాలు లేవు అంటూ కయదు చెప్పుకొచ్చింది.

# ట్రోల్స్‌కు నాట్యంతో ఆన్సర్

ఇటీవల హిందూ మతం, సనాతన ధర్మంపై యాంకర్ అనసూయ చేసిన కామెంట్లు వివాదాస్పదమ వడంతో నెటిజన్లు ఆమెను ట్రోల్ చేశారు. ఈ విమర్శలపై కృష్ణాష్టమి సందర్భం గా వెరైటీగా బదులిచ్చింది. తులసి కోమలవేణి.. నీలవర్ణ రాణి.. నిత్య కల్యాణి అనే కన్నడ భక్తి గీతానికి సంప్రదాయబద్ధంగా నాట్యం చేసింది. క్షమాగుణం, దేవుడిపై విశ్వాసం ప్రతి మనిషికి సహజంగా ఉండే గుణం అంటూ ఈ వీడియోకు ఓ క్యాప్షన్‌ను కూడా జోడించింది. కృష్ణుడికి అంతా తెలుసు అంటూ పేర్కొన్నది. ఆమె ఇన్‌స్టాలో పోస్టు చేసిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరలవుతోంది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.